ప్రతిపక్షం
www.prathipaksham.in

భారత్ లక్ష్యం 549 పరుగులు 12

బుధవారం 26.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 246 పేజీలు:12 వెల రూ. 5/-
@prathipaksham | prathipaksham tv telugu

పేదరికం లేని సమాజాన్ని నిర్మిద్దాం

అభివృద్ధి చెందిన దేశంలా ఉండాలి

- ఎవరూ నిస్సహాయంగా, బాధతో ఉండొద్దు
- అయోధ్య సాంస్కృతిక చైతన్యానికి నిదర్శనం
- శతాబ్దాల నాటి గాయాలు మానుతున్నాయి
- మనం రాముడి నుంచి చాలా నేర్చుకోవాలి
- ధర్మధ్వజారోహణంలో ప్రధాని నరేంద్ర మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

లక్నో, నవంబర్ 25 : యూపీలోని అయోధ్యలో మంగళవారం నాడు చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. శ్రీరామ జన్మభూమి ఆలయం శిఖరంపై ప్రధాని నరేంద్ర మోడీధర్మ ధ్వజం ఎగురవేశారు. వేద మంత్రాల పఠనం మధ్య అభిజిత్ ముహూర్తంలో జరిగిన ఈ ధ్వజా రోహణం రామ నగరాన్ని ఆనందంలో ముంచెత్తింది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ శతాబ్దాల తర్వాత గాయం మానిపోతోందని అన్నారు. 'అయోధ్య నగరం భారతదేశ సాంస్కృతిక చైతన్యానికి మరో గొప్ప ప్రదేశానికి సాక్ష్యంగా నిలుస్తోంది. శ్రీ రామ జన్మభూమి ఆలయ శిఖర ధ్వజారోహణ ఉత్సవం చాలా ప్రత్యేకం, అద్భుతం. ఈ ధర్మ ధ్వజం ఒక జెండా మాత్రమే కాదు. ఇది భారతీయ నాగరికత పునరుజ్జీవనానికి చిహ్నం. ఇది పోరాటం

..:: మిగతా 2లో

వారు ఓ మదర్సా కూడా కట్టలేరు అమ్మోనియం నైట్రేట్‌తో పేల్చేస్తున్నారు

- ఉగ్రవాదులపై మజ్లిస్ అధినేత ఓవైసీ ఆగ్రహం

..:: 3లో

ఒక దశకు మరొక దశకు మధ్య రెండు, మూడు రోజుల వ్యవధి ఉంటుందని ఎస్ఈసీ రాణి కుముదిని తెలిపారు. తొలి దశలో 4200 సర్పంచ్ స్థానాలు, 37,440 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. తొలి దశ ఎన్నికల నామినేషన్లకు గురు వారం నుంచే అవకాశం ఉంటుందన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగు తుందని పేర్కొన్నారు. పోలింగ్ అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచే ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారన్నారు.

'పంచాయతీ' షెడ్యూల్ విడుదల

రాష్ట్రంలో మూడు దశలుగా ఎన్నికలు

డిసెంబర్ 11, 14, 17 తేదీలలో పోలింగ్

- అదే రోజు ఓట్ల లెక్కింపు: ఫలితాల వెల్లడి
- రేపటి నుంచే మొదటి దశ నామినేషన్లు షురూ
- వెంటనే అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
- రాష్ట్రంలో గ్రామీణ ఓటర్లు 1.66 కోట్ల మంది
- వివరాలను వెల్లడించిన ఎస్ఈసీ రాణి కుముదిని
- ఎన్నికల ఏర్పాట్లకు సర్కారు అనుమతులు జారీ
- అన్ని ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం
- 12,728 సర్పంచ్,1,12,242 వార్డులకు ఎన్నికలు
- తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 25 : తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల నగారా మోగింది. 31 జిల్లాలలోని 12,760 గ్రామ పంచాయ తీలు, 1,13,534 వార్డులలో రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ) నోటిఫికేషన్‌జారీ చేసింది. డిసెంబర్ 11, 14, 17 తేదీలలో మూడు విడ తలుగా గ్రామపంచాయితీ ఎన్నికలు జరగను న్నాయి. అటు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం అనుమతినివ్వగా, పంచాయతీరాజ్‌శాఖ,

..:: మిగతా 2లో

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

- డిసెంబర్ 11, 14, 17 తేదీలలో ఎన్నికలు
- ఫేజ్ 1 : నవంబర్ 27 నుండి నామినేషన్లు
- డిసెంబర్ 11 న పోలింగ్
- ఫేజ్2: నవంబర్ 30 నుండి నామినేషన్లు
- డిసెంబర్ 14 న పోలింగ్
- ఫేజ్ 3: డిసెంబరు 3 నుండి నామినేషన్లు
- డిసెంబర్ 17 పోలింగ్
- 12,728 సర్పంచ్, 1,12,242 వార్డులకు ఎన్నికలు
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్.. అదే రోజు మధ్యాహ్నం రెండు నుంచి ఓట్ల లెక్కింపు

హసీనాకు ఉరి చట్ట విరుద్ధం..

మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష విధించడంపై ఆమె మద్దతుదారులు భగ్గుమంటున్నారు. తమ పార్టీ అధినేత్రికి నవంబర్ 17న విధించిన మరణ శిక్ష చట్ట విరుద్ధమని మండిపడుతున్నారు. బంగ్లాదేశ్ అవామీ లీగ్ మంగళవారం దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చింది.

11

ఖర్గేతో డీకే శివకుమార్ కీలక భేటీ!

కర్నాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతున్నది. సీఎం సిద్ధరామయ్య తర్వాత డీకే శివకుమార్ మంగళవారం బెంగళూరులో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సమావేశమయ్యారు.

11

ఇక 'బృహద్ నగర పాలక సంస్థ'

జీహెచ్ఎంసీ భారీ విస్తరణకు ఆమోదం.. 27 మున్సిపాలిటీల విలీనానికి నిర్ణయం

- ఓఆర్ఆర్ లోపల, ఆనుకుని ఉన్నవన్నీ మెర్జ్
- కొత్తగా మూడో విద్యుత్ డిస్కం ఏర్పాటు
- పెట్టుబడుల కోసం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ
- రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లు
- పునరుత్పాదక విద్యుత్ వినియోగానికి చర్యలు
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు
- వివరాలను వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 25 : జీహెచ్ఎంసీని భారీగా విస్తరించేందుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు లోపలా, దానిని ఆనుకుని ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయిం చింది. మంగళవారం నాడు సీఎం రేవంత్ అధ్యక్ష తన సమావేశమైన మంత్రివర్గం సుమారు నాలుగు గంటలకుపైగా సుదీర్ఘంగా వివిధ అంశాలపై చర్చించింది. కేబినెట్ సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్, శ్రీధర్‌బాబు మీడియాకు వివరాలను వెల్ల డించారు. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ,

..:: మిగతా 2లో

బీఆర్ఎస్‌కు కావాల్సిన వారి కోసమే

నాడు ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్

- పాలసీ లేదు, కేబినెట్ అనుమతి లేదు
- తొందరలోనే వాటి వివరాలు వెల్లడిస్తాం
- మేం పాలసీని పారదర్శకంగా తీసుకొచ్చాం
- నగరాన్ని కాలుష్య రహితం చేయడమే లక్ష్యం
- మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 25: పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తమ అనుయాయులకు, తమకు కావల్సిన వారికి పదవుల తో పాటు ప్రభుత్వానికి సంబంధించినవన్నీ కట్టబెట్టారని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. తిరిగి వారే 'దొంగే దొంగ' అన్న చందంగా మాట్లాడుతున్నారని విమ ర్శించారు. ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ కు సంబంధించి బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ఆరోపణలపై భట్టి తీవ్ర స్థాయిలో స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో ఎవరెవరికి భూములు బదలాయించారో

..:: మిగతా 2లో

ఇజ్రాయెల్ ప్రధాని భారత పర్యటన రద్దు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత పర్యటన మళ్లీ రద్దయ్యింది. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన ఆత్మహుతి బాంబు పేలుళ్ల ఘటనే ఇందుకు కారణమని తెలుస్తోంది.

11

నన్ను కదిలిస్తే మీ పునాదులు కదిలిస్తా

తనతో రాజకీయంగా పోరాడే దమ్ము బీజేపీ కి లేదని, తనను ఓడించడం ఆ పార్టీకి సాధ్యంకాదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్‌లో తనకు సవాల్ విసరాలని చూస్తే దేశవ్యాప్తంగా ఆ పార్టీ పునాదులను కదిలిస్తానని హెచ్చరించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' కు వ్యతిరేకంగా బన్‌గావ్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆమె ప్రసంగించారు.

..:: 11లో

కస్టడీ మరణాలు మన వ్యవస్థకే మచ్చ



- దేశం ఎట్టి పరిస్థితులలోనూ సహించదు
- అన్ని ఠాణాలలో సీసీ కెమెరాలు ఉండాల్సిందే
- కేంద్రం కోర్టును ఎందుకు తేలికగా తీసుకుంటోంది?
- అన్ని రాష్ట్రాలు, యూటీలు అఫిడవిట్ దాఖలు చేయాలి
- కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- తదుపరి విచారణ డిసెంబర్ 16కు వాయిదా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 25 : పోలీస్ కస్టడీలో జరిగే హింస, మరణాల మీద సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అది వ్యవస్థకే 'మచ్చ' అని వ్యా ఖ్యానించింది. దేశం సహించదని హెచ్చరించింది. దేశంలోని చాలా ఠాణాలలో సీసీటీవీలు పని చేయకపోవడాన్ని సుమోటోగా తీసుకున్న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. రాజస్థాన్‌లో గడచిన ఎనిమిది నెలలలోనే పోలీసు కస్టడీలో 11 మరణాలు జరిగాయని గుర్తు చేసింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, కస్టడీ మరణాలను ఎవరూ సమర్థించర ని, సమర్థించడానికి కూడా యత్నించలేరని అన్నారు. మరి, కస్టడీ మరణా లపై కేంద్రం ఎందుకు అఫిడవిట్ దాఖలు చేయలేదని కోర్టు ప్రశ్నించింది. కేంద్రం కోర్టును ఎందుకు తేలికగా తీసుకుంటోంది? అని నిలదీసింది. కేంద్రం మూడు వారాలలోగా అఫిడవిట్ దాఖలు చేస్తుందని తుషార్ మెహతా చెప్పారు. 2025లో రాజస్థాన్‌లో పోలీస్ కస్టడీలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మీడియా కథనాల

..:: మిగతా 2లో

సంపాదించడానికి అధికారంలోకి రాలేదు!

తాము నిజాయితీగా ప్రభుత్వాన్ని నడుపుతున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. పంజాబ్ లోని ఆనంద్‌పూర్ సాహిబ్‌లో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు.

11

రాష్ట్రీయం

కాంగ్రెస్ పై 'విద్యార్థి రణభేరి' మోగించాలి

- వారి అరాచక పాలనను అంతం చేయాలి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పై త్వరలో పోరుబాట
- అదానీ, అంబానీలను దాటాలనుకుంటున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలపై విద్యార్థి లోకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తన నివాసంలో విద్యార్థి విభాగం నాయకులతో మంగలవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ విద్యా రంగానికి స్వర్ణయుగం తీసుకువచ్చారని, గురుకుల విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ కాలేజీల ఏర్పాటుతో లక్షల మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారని గుర్తు చేశారు. గత పదేండ్లలో విద్యా రంగంలో అద్భుతమైన ప్రగతి జరిగితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను పూర్తిగా నీరుగారుస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. గత పదేండ్లలో ఏమీ జరగలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారానికి తెరతీసిందని, వారి అబద్ధాలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వచ్చే నెల నుంచి పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. వేలాది మంది విద్యార్థులను సమీకరించి, ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గురుకులాల్లో కల్తీ ఆహారం మొదలుకొని, విద్యార్థుల ఆత్మహత్యల వరకు అనేక విషాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విద్యార్థి విభాగం చేపట్టిన 'గురుకుల బాట'తో ప్రభుత్వంలో కొంత చలనం వచ్చినప్పటికీ, అది కేవలం కాంగ్రెస్ నాయకుల నటనగానే మిగిలిపోయిందన్నారు. గురుకులాల దుస్థితిపై మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని స్పష్టం చేశారు.

అదానీ, అంబానీలను దాటాలనుకున్నారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకే దెబ్బతో అదానీ, అంబానీలను దాటిపోవాలని చూస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. పారిశ్రామికవాడల భూములను విక్రయించి నాలుగు లక్షల కోట్ల భూకుంభకోణానికి పాల్పడాలని చూస్తున్నారని ఆరోపించారు. మునిమనవలు, వారి మునిమనవలు కూడా కూర్చుని తిన్నా తరగని ఆస్తిని వెనుకేసుకోవాలనే దురుద్దేశంతోనే ఈ భూకుంభకోణానికి తెరలేపారని అన్నారు. తక్కువ ధరకు 9,292 ఎకరాలను ధారాదత్తం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు.

నేడు భారత రాజ్యాంగ దినోత్సవం సదస్సు

- విద్యార్థులు, యువత పాల్గొనాలని వినతి

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 25 : 'భారత రాజ్యాంగ దినోత్సవం' సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గం జాక్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాలులో (మల్లె చెట్టు చౌరస్తా) బుధవారం ఉదయం11 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నారు. నల్సార్ లా యూనివర్సిటీ, హైదరాబాద్ ప్రొఫెసర్ డా. వాగీషన్ ప్రధాన వక్తగా పాల్గొంటారు. కళాశాల విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, కర్షకులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల నాయకులు, అన్ని పార్టీ ల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని జాక్ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారం నాడు అంబేద్కర్ చౌరస్తాలో బ్యానర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో జాక్ కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, నాయకులు ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, జేఏసీ నాయకులు వేముల జగదీశ్,నాంపల్లి సమ్మయ్య, కోడూరి శ్రీదేవి, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు మార్క అనిల్ గౌడ్, గౌడ సంఘం జిల్లా నాయకులు బుర్ర పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన పెరిక కుల రాష్ట్ర నాయకులు

- రాష్ట్ర కమిటీని అభినందించిన మంత్రులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25: తెలంగాణ రాష్ట్ర పెరిక (పురగిరి క్షత్రియ) కుల రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన యర్రంశెట్టి ముత్తయ్య నాయకత్వంలో మంగళవారం హైదరాబాద్ లో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, సీతక్కలను మర్యాదపూర్వకంగా కలిసారు. యర్రంశెట్టి ముత్తయ్య, రాష్ట్ర కమిటి నాయకులకు మంత్రులు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. వివిధ రంగాలలో పెరిక కులస్థుల అభివృద్ధికి ప్రభుత్వం ఇతోధికంగా సహాయం అందించాలని, స్థానిక సంస్థలలో పెరిక కులస్తులకు సముచిత స్థానం కల్పించాలని, ప్రభుత్వ పరంగా ఇచ్చే నామినేటెడ్ పదవులలో అవకాశాలు కల్పించాలని వారు మంత్రులను విజ్ఞప్తి చేశారు. ఉత్పత్తి, శ్రమలో కీలకపాత్ర పోషించడంతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో స్వయం కృషితో రాణిస్తున్న పెరిక కులస్తులు రాజకీయాల్లో కూడా చురుకుగా ఉన్నారని అలాంటి పెరిక కులస్థుల అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రభుత్వం తరపునుండి, పార్టీ నుండి సహకారం అందిస్తామని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ధనేకుల కృష్ణ, ముఖ్య సలహాదారులు చింతం లక్ష్మీనారాయణ, డాక్టర్ సంగని మల్లేశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కోట మల్లికార్జున్, ఆక రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి రంగారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకత మల్లికార్జునరావు, ఆర్థిక కార్యదర్శి బోడకుంటి సుధాకర్, అధికార ప్రతినిధి సాయిని నరేందర్, రాష్ట్ర నాయకులు అంకత ఉమామహేశ్వర్ రావు, బుయ్యాని శివకుమార్, శ్రీధర్ల జగదీశ్వర్, గంప నాగరాజు, యర్రంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ' షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేపట్టాయి. మూడు విడతతలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. ఎన్నికల కోడ్ మంగళవారం నుంచే అమలులోకి వస్తుందని వెల్లడించారు. ఒక దశకు మరొక దశకు మధ్య రెండు, మూడు రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు. తొలి దశలో 4200 సర్పంచ్ స్థానాలు, 37,440 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. తొలి దశ ఎన్నికల నామినేషన్లకు గురువారం నుంచే అవకాశం ఉంటుందన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. పోలింగ్ అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచే ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారన్నారు. సెప్టెంబర్ 29న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించామని, కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే విధించారని ఎస్ఈసీ కుముదిని పేర్కొన్నారు. ఈ నెల 27నుంచి తొలి దశల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. నవంబర్ 30 నుంచి రెండో విడత ఎన్నికలకు నామినేషన్లు మొదలు కానుండగా.. మూడో దశ నామినేషన్ల ప్రక్రియ డిసెంబర్ 3వ తేదీన ప్రారంభమవుతుందని రాణి కుముదిని వివరించారు.

ఇక 'బృహద్ నగర పాలక సంస్థ'

మొదటిపేజీ తరువాయి

పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, ఫిర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. విలీనానికి అవసరమైన జీహెచ్ఎంసీ యాక్ట్, తెలంగాణ మున్సిపల్ యాక్ట్‌లను సవరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు.

మూడో డిస్కమ్ కు అనుమతి

రాష్ట్రంలో ఇప్పుడున్న ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌రెండు డిస్కమ్‌లతో పాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయి. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, రాబోయే పదేండ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాలను కేబినెట్ సమగ్రంగా చర్చించింది. విద్యుత్ విభాగం అధికారులు సమగ్రంగా సమర్పించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించింది. పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేండ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేండ్ల కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చింది.

కస్టడీ మరణాలు మన వ్యవస్థకే మచ్చ

మొదటిపేజీ తరువాయి

ఆధారంగా సుప్రీంకోర్టు సెప్టెంబర్ నెలలో దీనిని సుమోటోగా స్వీకరించింది. వాస్తవానికి 2018లోనే మానవ హక్కుల ఉల్లంఘనలను తనిఖీ చేయడానికి వీలుగా పోలీసు స్టేషన్ లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు అమికస్ క్యూరీగా సుప్రీంకోర్టుకు సాయం చేస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు కూడా విన్నది. ఈ క్రమంలోనే సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ సహా అన్ని దర్యాప్తు సంస్థల కార్యాలయాలలో సీసీ టీవీ కెమెరాలు, రికార్డింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. అమెరికాలోని పోలీసు స్టేషన్లలో, జైళ్లలోని జరిగే వాటిని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారని పేర్కొంది. కస్టడీలో హింస, మరణాలపై 11 రాష్ట్రాలు మాత్రమే సమ్మతి అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇంకా అఫిడవిట్ లను దాఖలు చేయలేదు. ఇందులో యూనియన్ ఆఫ్ ఇండియా కూడా ఉందని ధర్మాసనం పేర్కొంది. అఫిడవిట్లు దాఖలు చేయని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మూడు వారాల సమయం మంజూరు చేస్తూ, తదుపరి విచారణను డిసెంబర్16కు వాయిదా వేసింది.

బీఆర్ఎస్‌కు కావాల్సిన వారి కోసమే

మొదటిపేజీ తరువాయి

త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు. కేబినెట్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ వారికి కావలసిన వారి కోసం, వ్యక్తుల కోసం చేశారని, పాలసీ లేదు, క్యాబినెట్ అనుమతి కూడా లేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అలా చేయడం లేదని, హైదరాబాదులో ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ఫర్ పాలసీని పారదర్శకంగా తీసుకువచ్చామని వివరించారు. మహా నగరాన్ని కాలుష్య రహితం చేయడం, రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడం ఎజెండాగానే ఇండస్ట్రియల్ పాలసీ తీసుకువచ్చామని తెలిపారు. 'పేదలకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందాలి, ప్రతి సంవత్సరం ఖర్చు పెరుగుతుంది, ప్రజలపై పన్నులు మోపే ఆలోచన లేదు, ఆదాయం సమకూర్చుకునే బాధ్యత ప్రభుత్వం పై ఉంది' అని డిప్యూటీ సీఎం తెలిపారు. 50 శాతం ఎస్ఓఆర్ ప్రకారం 80 ఫీట్ల రోడ్డు ఉన్నవారికి అవకాశం ఇస్తే కన్వర్షన్ చేసుకుంటారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ పెరిగితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందన్నారు. అటు నాచారం, మౌలాలి, ఉప్పల్, జీడిమెట్ల, బాలనగర్, కూకట్పల్లి వంటి ఇండస్ట్రియల్ కాలనీలు 50 సంవత్సరాల క్రితం హైదరాబాద్ అవతల ఉండేవని, పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి ఆనాడు ప్రభుత్వాలు ప్రోత్సహించాయని గుర్తు చేశారు.

50 యేండ్ల కాలంలో

'50 యేండ్ల కాలంలో హైదరాబాద్ నగరం పెద్ద ఎత్తున విస్తరించి ఇండస్ట్రియల్ పార్కుల చుట్టూ పెద్ద ఎత్తున ఇళ్ళ నిర్మాణం జరిగింది. నగరాన్ని కాలుష్యం నుంచి విముక్తి కలిగించేందుకు ప్రస్తుతం ఆ పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు బయటకి తరలించాల్సి ఉంది. ఢిల్లీలో కాలుష్య తీవ్రత పెరిగి పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి హైదరాబాదు నగరానికి రావొద్దనేది ప్రభుత్వం ఆలోచన. ప్రస్తుతం ఇండస్ట్రియల్ పార్కులలో ఉన్న వ్యక్తులను ఒత్తిడి చేసి బయటికి పంపలేం, నగరాన్ని పొల్యూషన్ రెడ్ జోన్ ఆరంజ్ జోన్ల నుంచి విముక్తి కల్పించాలని కోర్టులు సూచించాయి' అని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకే పారదర్శకంగా సమగ్ర ఇండస్ట్రియల్ ల్యాండ్ కన్వర్షన్ పాలసీని తీసుకువచ్చామని వివరించారు.

పేదరికం లేని సమాజాన్ని నిర్మిద్దాం

మొదటిపేజీ తరువాయి

నుంచి సృష్టికి సంబంధించిన కథ, శతాబ్దాలుగా కొనసాగుతున్న కలల సాకార రూపం, సాధువుల తపస్సు సమాజ భాగస్వామ్యం సార్థక ఫలితం' అని ప్రధాని వివరించారు. '500 సంవత్సరాలుగా వెలుగుతున్న యజ్ఞానికి పూర్ణాహుతి. విశ్వాసం ఒక్క క్షణం కూడా చెక్కుచెదరలేదు' అని మోదీ పేర్కొన్నారు. పేదరికం లేని, ఎవరూ బాధపడని, నిస్సహాయంగా లేని సమాజాన్ని నిర్మిద్దామన్నారు. '2047 నాటికి దేశం స్వాతంత్ర్యం పొంది వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పుడు, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలి. రాముడి నుంచి దేశం సంకల్పం గురించి చర్చించాం. మనం 1000 సంవత్సరాల పాటు భారతదేశానికి పునాది వేయాలి, కేవలం వర్తమానం గురించి ఆలోచించేవారు రాబోయే తరాలకు అన్యాయం చేస్తారు. మనం లేనప్పుడు కూడా ఈ దేశం ఉంది. మనం లేనప్పుడు కూడా ఈ దేశం ఉంటుంది. దీని కోసం మనం రాముడి నుంచి కూడా నేర్చుకోవాలి' అని ప్రధాని సూచించారు.

నూతన 'లేబర్ కోడ్'లతో తీవ్ర నష్టం

- తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దు
- టీయూడబ్ల్యూజే రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం
- ముఖ్యమంత్రికి విన్నవించాలని నిర్ణయం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25: కేంద్ర ప్రభుత్వం అమలులోనికి తీసుకొచ్చిన నూతన 'లేబర్ కోడ్'లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ), కేంద్ర కార్మిక సంఘాలు తీర్మానించాయి. నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ధర్నాలతో పాటు ఇందిరాపార్క్ వద్ద 'కార్మికుల తలపెట్టనున్న నిరసన గళం' కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్ అలీ అధ్యక్షతన బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం ఈ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. మీడియా అకాడెమీ చైర్మన్, ఐజేయూ జాతీయ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులతో పాటు వైట్ కాలర్ ఉద్యోగులు పరోక్షంగా తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కనీసం కార్మిక సంఘాల నేతలతో చర్చించకుండానే నూతన లేబర్ కోడ్‌లను అమలు చేయడం ఆశ్చర్యకరమన్నారు. నూతన లేబర్ కోడ్‌లపై ప్రధాన మీడియాలు చర్చలు పెట్టకపోవడం విడ్డూరమని, కార్పొరేట్ శక్తుల చేతులలో మీడియా బందీ అయిపోయిందన్నారు. రాబోయే రోజులలో న్యాయ వ్యవస్థ కూడా రాజకీయ నాయకుల చేతులకు వెళ్లిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. జాతీయ మీడియాతో పాటు తెలుగు ప్రధాన పత్రికలు సైతం ప్రస్తుతం అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులు, ఉద్యోగులకు కలిగే లాభ, నష్టాలను వివరించకపోవడం బాధకరమని చెప్పారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో వర్కింగ్ జర్నలిస్టు అంటే మెడికల్ రిప్రజెంటివ్ ఉద్యోగంతో సమానంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్యాంకింగ్ వ్యవస్థ నిర్వీర్యం

ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పీవీ కృష్ణారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి బ్యాంకింగ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతోందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్ బ్యాంకులను ప్రోత్సహించడం, మెర్జ్ పేరుతో బ్యాంకుల విలీనం తదితర లాంటివి బ్యాంకు ఉద్యోగుల శ్రమదోపిడీ చేయడమేనని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతన లేబర్ కోడ్‌లతో 'కంపెనీలకు లాభం, కార్మికులకు నష్టం అని అన్నారు. కార్మిక సంఘాలన్ని కలిసి పది రోజులు నిర్విరామంగా సమ్మె చేస్తే కేంద్రం దిగివస్తుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాడే యూనియన్లను లేకుండా చేయడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం లేబర్ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్ పద్మ మాట్లాడుతూ 'సత్యమేవ జయతే-శ్రమయేవ జయతే' అని మోడి ప్రభుత్వం కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో ఐజేయూ నేత దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, ఐజేయూ జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, రాష్ట్ర కార్యదర్శి వి.యాదగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ. రాజేశ్, హెచ్ యూజే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, కార్యదర్శి బి. వెంకటేశం, ఐఎఫ్టీయూ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్రాంతి వరకు ఆప్కోలో 40% డిస్కౌంటుతో చేనేత వస్త్రాల అమ్మకాలు కొనసాగుతాయి. డిస్కౌంట్ అమ్మకాలతో రోజువారీ విక్రయాలు రూ.3 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెరిగాయి. ఇప్పటికే విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించాం. త్వరలో విశాఖ, కర్నూలు, కడప వంటి నగరాలు, ఇతర జిల్లా కేంద్రాల్లోనూ చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం

- ఏపీ మంత్రి సవిత

వారు ఓ మదర్సా కూడా కట్టలేరు

అమ్మోనియం నైట్రేట్‌తో పేల్చేస్తున్నారు

- ఉగ్రవాదులపై మజ్లిస్ అధినేత ఓవైసీ ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25 : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు సంఘటనపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ శత్రువులు తమ శత్రువులని స్పష్టం చేశారు. ముస్లింలు స్థాపించిన విద్యా సంస్థలపై ఎవరైనా కుట్ర చేస్తే దాన్ని ఖండిస్తామన్నారు. ఎర్రకోట పేలుడు ఘటనలో 14 మంది మరణించారని, వారిలో హిందువులు, ముస్లింలు ఉన్నారనన్నారు. ఇలాంటి వారి చేతిలో దేశం బలహీనపడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆత్మాహుతి దాడి చేయడానికి వారు అమోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలతో పేల్చుకున్నారు. అనేక వాహనాలు కాలిపోయాయి, అనేక మంది గాయపడ్డారు. అయితే, ఈ పేలుడు సంఘటనను దేశ శత్రువుల కుట్రగా ఓవైసీ అభివర్ణించారు. ఒక మదర్సా లేదా స్కూల్ గది కూడా కట్టలేని ఉగ్రవాదులు అమోనియం నైట్రేట్‌తో దేశాన్ని దెబ్బలు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సభలో ముస్లింలపై జరుగుతున్న అన్యాయాలను కూడా ఓవైసీ ప్రస్తావించారు. ముస్లింలను సెకండ్ క్లాస్ సిటిజన్లుగా మార్చాలని భావించేవారు తప్పుగా ఆలోచిస్తున్నారన్నారు. 'మా తరాలు ముగిసిపోవచ్చు, దేశంలో ముస్లింలు గౌరవప్రదంగా జీవిస్తూనే ఉంటారు. మేము మా హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతులతోనే పోరాడతామని' ప్రకటించారు. తమ మసీదులను కాపాడుకుంటామని,ఒక మసీదును ధ్వంసం చేస్తే, తాము లక్షలాది మసీదులు నిర్మిస్తామన్నారు. తాము చాలా బాధలు భరించామని, ఇకపై కూడా భరిస్తామని అన్నారు, కానీ, తమ దేశాన్ని ఎప్పుడూ ద్వేషించలేదన్నారు. ముస్లింలను ద్వేషంతో చూస్తూ అన్యాయం చేస్తే, భారతదేశం ఎలా అభివృద్ధి సాధిస్తుందని ఓవైసీ ప్రశ్నించారు. రాజ్యాంగంలో సమానత్వం మూలాధికారమని, దానిని మరచిపోకూడదని అన్నారు. మసీదు వ్యవహారంలో తీర్పు వచ్చినప్పుడు ఏ ముస్లిం కూడా కోర్టులో చెప్పు విసరలేదని గుర్తు చేశారు.

ఈశాన్య రాష్ట్రాల పురోగతిలో భాగస్వామ్యం

- కీలక రంగాలలో కలసి పని చేసేలా రోడ్ మ్యాప్
- 'తెలంగాణ- నార్త్ ఈస్ట్ కనెక్ట్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25 : ఆశాజనక వృద్ధి కేంద్రాలుగా మారుతున్న ఈశాన్య రాష్ట్రాల పురోగతిలో భాగస్వామ్యం అయ్యేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. డిజిటల్ కనెక్టివిటీ, ఎంటర్ప్రెన్యూర్షిప్, టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్, లైఫ్ సైన్సెస్, బయో ఇన్నోవేషన్, రూరల్ గ్రోత్ తదితర రంగాలలో భాగస్వామ్యానికి సమగ్ర రోడ్ మ్యాప్ రూపొందిస్తామన్నారు. మంగళవారం నాడు రాజ్ భవన్ లో నిర్వహించిన 'తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్(ఫేజ్ 2)' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రాంతం, రాష్ట్రంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ అక్కున చేర్చుకునే గొప్ప మనస్సు తెలంగాణ ప్రజలది అని వివరించారు. కనెక్టివిటీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్ లాంటి సవాళ్లను సైతం అధిగమించి డిజిటల్ అక్షరాస్యత, ఐటీ స్కిల్లింగ్, ఫిన్ టెక్, డిజిటల్ సర్వీస్ ఈశాన్య రాష్ట్రాలు అందిపుచ్చుకుంటున్నాయన్నారు. భవిష్యత్ కోసం ఎదురు చూడకుండా, భావితరాల అవసరాలకు అనుగుణంగా నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ఆ దిశగా రేపటి తెలంగాణ కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ తెలంగాణ ఈశాన్య రాష్ట్రాల బంధం మరింతగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

ఫిబ్రవరి 1న హైదరాబాద్ హెరిటేజ్ రన్

- నగర స్ఫూర్తిని ప్రపంచానికి చాటేలా మహోత్సవం
- మీడియాకు వెల్లడించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25 : మహానగర అపురూప చరిత్రను, వాస్తు నిర్మాణ వైభవాన్ని, ఉజ్వల స్ఫూర్తిని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడానికి 'హైదరాబాద్ హెరిటేజ్ రన్' అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఈ కార్యక్రమ వివరాలను చరిత్రాత్మక తారామతి బిరాదరి వేదికగా మంగళవారం నాడు ఆయన వెల్లడించారు. పర్యాటక, సాంస్కృతిక (క్రీడలు) శాఖ ఆధ్వర్యంలో రాపిడో టైటిల్ స్పాన్సర్‌గా ఈ చారిత్రక క్రీడా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈవెంట్‌కు తెలంగాణ టూరిజం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సహకారం అందిస్తున్నాయన్నారు. మహానగర వైభవాన్ని, చారిత్రక ప్రాధాన్యతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు తారామతి బిరాదరిని వేదికగా ఎంచుకున్నామన్నారు. హెరిటేజ్ రన్ పరుగు మాత్రమే కాదని, క్రీడలు, పర్యాటకం, సాంస్కృతిక గర్వానికి సంబంధించిన మహా వేడుక అని పేర్కొన్నారు. చార్మినార్ నుంచి కుతుబ్‌షాహీ సమాధుల దాకా మార్గాన్ని సజీవ వారసత్వ కారిడార్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. మహానగరవాసులు, యువత క్రీడాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరు, ర్యాపిడో హెడ్ ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఈవెంట్ 1 ఫిబ్రవరి 2026న జరగనుంది.

మనువాదాన్ని మట్టుపెడదాం

- మన రాజ్యాంగాన్ని ఎత్తిపడదాం
- డీబీఎఫ్ నేతలు రమేష్ కుమార్, చుంచు రాజేందర్

ప్రతిపక్షం వరంగల్ బ్యూరో, నవంబర్ 25: ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకి ప్రాణం పోసిన భారత రాజ్యాంగ ముసాయిదా చేపట్టిన చారిత్రాత్మక దినం నవంబర్ 26, జాతీయ రాజ్యాంగ దినోత్సవం. జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను స్మరించుకోవాలని డీబీఎఫ్ నేతలు పిలుపునిచ్చారు. రిపబ్లిక్ డే ను అంబేద్కర్ డే గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నాడు డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ కలిసి కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాజ్యాంగ ఫలాలు అందరికి అందేవిధంగా ప్రభుత్వాలు కృషిచేయాలన్నారు. నవంబర్ 26 నుండి జనవరి 26 వరకు నిర్వహించే భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజును గుర్తు చేసుకుంటూ రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలందరు జరుపుకోవాలని, ప్రతి పాఠశాలలో రాజ్యాంగ పిఠికను ప్రతిజ్ఞ సమయంలో చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి,డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు బౌతు రాధ, జిల్లా నాయకులు రమ,బాగ్య,గుగులోతు కౌసల్య,దుర్గం పుష్పలత, నాయకులు స్వామి, రాజు, కిరణ్, రవి పాల్గొన్నారు.

గల్ఫ్ ఎన్నారై పాలసీ అధ్యయనం

- డిసెంబర్ లో జిల్లాల పర్యటన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25 : తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పనలో భాగంగా గల్ఫ్ వలసలు, సమస్యలు, పరిష్కారాలపై అధ్యయనం చేసే క్రమంలో డిసెంబర్ నెలలో గల్ఫ్ ప్రభావిత జిల్లాలలో పర్యటిస్తామని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులు, అక్కడి నుంచి తిరిగి వచ్చిన వారితో సహా గల్ఫ్ కుటుంబాలను కలిసి వారి నుంచి సమాచారం సేకరిస్తామని తెలిపారు. ముందుగా నిర్మల్ జిల్లా ఖానాపూర్, జన్నారం ప్రాంతాలలో డిసెంబర్ 3, 4 తేదీలలో పర్యటిస్తామని, కలెక్టర్, ఎస్పీ, కార్మిక, ఉపాధి, మహిళ, శిశు అభివృద్ధి తదితర శాఖల అధికారులను, విద్యావేత్తలను, రిక్రూటింగ్ ఏజెన్సీలు, సామాజిక సంఘాల ప్రతినిధులతో సమావేశమవుతామని వివరించారు. కమిటీకి అవసరమైన ప్రయాణ, వసతి సౌకర్యాలు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు.

పోలీసుల అయ్యప్ప మాలధారణపై ఆంక్షలు

- బ్లాక్ డ్రెస్, గడ్డం, జుట్టు పెంచుకోవడంపై నిషేధం!



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25 : తెలంగాణ పోలీసు శాఖ మతపర దీక్షలపై ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. డ్యూటీలో ఉన్నపుడు అయ్యప్ప దీక్ష లేదా మతపర దీక్షలు చేపట్టరాదని పేర్కొంది. దీక్ష చేసే పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా సెలవు తీసుకుని మాత్రమే కొనసాగించాలని పేర్కొంది. సెలవు తీసుకోకుండా మతాచారాలు పాటిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించింది. పోలీసుల అయ్యప్ప మాల ధారణ, నలుపు వస్త్రాలు, గడ్డం, జుట్టు పెంచుకోవడంపై నిషేధం విధించింది. విధులలో ఉన్నపుడు యూనిఫాం, షూస్ ధరించాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఇటీవల ఒక ఎస్ఐకి మెమో కూడా జారీ చేశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ దీని మీద తీవ్రంగా స్పందించారు. 'ఈ నిబంధనలు హిందువులపై మాత్రమే అమలవుతాయా? ముస్లింలు రంజాన్‌లో ఉపవాసం చేస్తూ, గడ్డం పెంచుకున్నప్పుడు ఇలాంటి ఆదేశాలు ఉండవా?' అంటూ ప్రశ్నించారు. ఈ సర్క్యులర్ మత స్వేచ్ఛను హరించడమేనని విశ్వ హిందూ పరిషత్, హిందూ సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలకు, ఇతర మతాలకు ఇదే రూల్స్ ఉంటాయా అని నిలదీశారు.

'సర్పంచ్'కు అమలు కాని 'రూల్ ఆఫ్ రిజర్వేషన్'

- దానిని ఎస్ఈసీ, సర్కారు వెంటనే సరిదిద్దాలి
- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25 : గ్రామపంచాయతీలకు రిజర్వేషన్ కేటాయింపులో 'రూల్ ఆఫ్ రిజర్వేషన్' అనుసరించలేదని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. దీంతో రాష్ట్రంలోని 27 మండలాలలో కనీసం ఒక్క గ్రామ పంచాయతీకి కూడా బీసీ కోటా దక్కకపోవడం చేత బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. దీనిని సరిదిద్దిన తరువాతే నామినేషన్ల ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు 2011 జనాభా లెక్కలను, బీసీ రిజర్వేషన్లకు డేడికేషన్ కమిటీ ఇచ్చిన సర్వేను పరిగణనలోకి తీసుకోవడం వల్లే ఈ గందరగోళం ఏర్పడిందన్నారు. ప్రతి మండలంలోనూ నిర్దేశిత బీసీ కోటా ప్రకారం సర్పంచ్ స్థానాలను బీసీలకు రిజర్వ్ చేయాలని ప్రభుత్వాన్ని దాసు సురేష్ కోరారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోతే బీసీ సమాజం రాజకీయంగా తీవ్రంగా నష్టపోతుందని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు అయ్యేలా తదుపరి కార్యాచరణ కోసం ప్రజా ఐక్య కూటమి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, బీసీ సంఘాలు, కుల సంఘాలతో పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు దాసు సురేష్ తెలిపారు. సోమాజిగూడ లోని ప్రెస్ క్లబ్లో ఈనెల 27న జరిగే అఖిలపక్ష ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశంలో తదుపరి కార్యాచరణ ఖరారు చేస్తామని చెప్పారు.

పేదల 'సేవ'లో వాసవీ క్లబ్

- గడ్డి అన్నారం క్షేత్రంలో వాటర్ ప్లాంట్
- భక్తులకు కొంగుబంగారం: ఎంపీ లక్ష్మణ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25 : దిల్ సుఖ్ నగర్ గడ్డి అన్నారంలో వెలసిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి భక్తులకు కొంగు బంగారంగా నిలిచారని బీజేపీ జాతీయ ఓబీసీ సెల్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఎంపీ లక్ష్మన్ దేవాలయంలో మంగళవారం ప్రారంభించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ దేవాలయ కమిటీ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. 360 రోజులు నిత్యం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్సీ బగ్గారపు దయానంద్ వాసవీ క్లబ్ సేవలను కొనియాడారు. వాసవీ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షులు దేవత శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదవారికి ఏ అవసరం ఉన్నా ముందుండి సేవ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్, దేవరం లింగారెడ్డి, కోశాధ్యక్షులు వక్కలంక శ్రీనివాసరావు, భాషపాక సంతోష్, వీరేశం, ప్రొద్దుటూరు కుమారస్వామి, నాగేందర్, బచ్చు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, వాసవి క్లబ్ జనరల్ సెక్రెటరీ కేవీ లక్ష్మీనారాయణ, కోశాధికారి చింతల్లట్ శ్రీరామ్ , మేడం రాంబాబు , కూన వెంకట గోపాలకృష్ణ , పబ్బతి రవి ప్రసన్న , ప్రొద్దుటూరు వేణుగోపాల్, బీజేపీ నాయకులు లింగాల హరి గౌడ్, రాంరెడ్డి, గడ్డి అన్నారం బీజేపీ అధ్యక్షులు దాసరి ప్రకాష్, సుబ్బారెడ్డి, సందీప్ తో పాటు ఆయల అర్చకులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలతో మహిళల సాధికారత

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మహిళా సంఘాలకు రుణాల పంపిణీ

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 25: గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాలకు మన ప్రభుత్వం అందజేస్తున్న కోట్లాది రూపాయల వడ్డీ లేని రుణాలు మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడతాయని అసెంబ్లీలో ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అటు, వ్యాపార విస్తరణ, స్వయం ఉపాధి పెంపుదలకు తోడ్పతాయనీ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయనీ చెప్పారు. మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం నాడు జరిగిన ఈ రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 3,215 సంఘాలకు రూ. 3 కోట్ల 48 లక్షల 68 వేల500 చెక్కును స్వయం సహాయక బృందాలకు అందజేశారు. తెలంగాణలో గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఎంతో పెద్దపీట వేస్తుందని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారతను లక్ష్యంగా చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేసిందన్నారు. ఈ నిధులను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,57,098 గ్రామీణ మహిళా సంఘాల ఖాతాలలో జమ చేశారనీ ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే షాద్ నగర్ లో కూడా పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, తహసీల్దార్ నాగయ్య, కేశంపేట, కొత్తూరు, కొందుర్గు, నందిగామ, చౌదరి గూడ మండలాల నుండి ఎంపీడీఓలు, ఆ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరయ్యారు.

"

అయ్యప్ప మాల వేసుకున్న హైదరాబాద్ కంచనా బాగ్ ఎస్సైకి మెమో జారీ చేశారు. పోలీసుల రూల్స్ కేవలం హిందువులకే వర్తిస్తాయా?. ముస్లింలకు ఫ్రీడమ్ ఇచ్చి హిందూ పోలీసులకు ఎందుకు ఇవ్వట్లేదు. రంజాన్ సమయంలో ఇలాంటి రూల్స్ ఎందుకు పెట్టరు. చట్టాలు అందరికీ సమానంగా ఉండాలి.

- ఎమ్మెల్యే రాజాసింగ్

ఓపెన్ వాయిస్

భారత రాజ్యాంగం: పరిశీలన

భారత రాజ్యాంగం, జాతీయ జెండా, దేశంలోని కులవ్యవస్థ మీద రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అభిప్రాయాలపై ఎప్పుడూ విమర్శలు వినిపిస్తూనే ఉంటాయి. ఈ మూడు ప్రధాన అంశాలపై స్వాతంత్ర్యం నుంచి ఇప్పటిదాకా అనేక సందర్భాలలో ఆర్ఎస్ఎస్ చాలాసార్లు తన అభిప్రాయాలు మార్చుకుంది.'అనేక పశ్చిమ దేశాల రాజ్యాంగాల నుంచి అనేక విషయాలు తీసుకుని వైవిధ్యభరితంగా మన దేశ రాజ్యాంగం రూపొందించారు. దాంట్లో మన సొంతం అని పిలవడానికి ఏదీ లేదు. మన జాతీయ లక్ష్యానికి సంబంధించి, మన జీవితాలలోని ప్రాధాన్యాలకు సంబంధించి ఒక్క పదమన్నా అదులో ఉందా? లేదు' అని 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో సంఘ్ రెండో అధ్యక్షుడు మాధవ్ సదాశివరావ్ గోల్వాల్కర్ రాశారు. 'రేపు అధికారం చేపట్టబోతున్నవాళ్లు మన చేతులలో త్రివర్ణజెండా ఉంచుతారు. కానీ, దాన్ని హిందువులు ఎప్పుడూ గౌరవించరు, తమ సొంతంగా భావించరు. మూడు అనే పదం మంచిది కాదు. మూడు రంగులతో ఉండే జెండా మానసికంగా చాలా తీవ్ర చెడు ప్రభావం చూపుతుంది. దేశానికి ప్రమాదకరం' అని దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఒకరోజు ముందు 1947 ఆగస్టు 14న తన పత్రిక ఆర్గనైజర్‌లో ఆర్ఎస్ఎస్ రాసిన వ్యాఖ్యలను చాలా మంది నేటికీ విమర్శిస్తుంటారు. ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించిందని ప్రముఖ లాయర్, రాజకీయ వ్యాఖ్యాత ఏజీ నురానీ 'ది ఆర్ఎస్ఎస్: దేశానికి ప్రమాదం' అనే తన పుస్తకంలో రాశారు. ఏజీ నురానీ బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టులో పని చేశారు.'రాజ్యాంగాన్ని హిందూ వ్యతిరేకమని పేర్కొంటూ, దేశంలో తాము ఎలాంటి రాజకీయం కోరుకుంటున్నామో తెలుపుతూ 1993 జనవరి 1న సంఘ్ శ్వేతపత్రం ప్రచురించింది. భారత్ సమగ్రతను, సోదరభావాన్ని, మతపర సౌభ్రాతృత్వాన్ని దెబ్బ తీసింది ఎవరు? ఆకలి చావులకు, నిరుద్యోగితకు, అవినీతికి, మతపర అసహనానికి కారణం ఎవరు? దీనికి సమాధానం 'భారత ప్రస్తుత రాజ్యాంగం' అనే శ్వేతపత్రంలో ఉంది' అని నురానీ రాశారు.1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన కొన్ని రోజుల తర్వాత ఈ శ్వేతపత్రం ప్రచురితమైంది.'ప్రస్తుత రాజ్యాంగం దేశ సంస్కృతి, స్వభావం, పరిస్థితులు మొదలైన వాటికి విరుద్ధంగా ఉంది. దీనిపై ఇతర దేశాల ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు చేసిన తర్వాతే మన ఆర్థిక విధానం, న్యాయ, పరిపాలనా నిర్మాణం, ఇతర జాతీయ సంస్థల గురించి మనం కొత్తగా ఆలోచించాల్సి ఉంటుంది' అని శ్వేతపత్రం పీఠికలో స్వామీ హిరానంద్ రాసినట్టు నురానీ చెప్పారు. రాజ్యాంగంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో ఈ దేశం నీతి, ప్రతిభకు అనుగుణంగా రాజ్యాంగాన్ని స్వీకరించాలని 1993 జనవరిలో అప్పటి ఆర్ఎస్ఎస్ చీఫ్ రాజేంద్ర సింగ్ రాశారని పుస్తకంలో నురానీ పేర్కొన్నారు.1993 జనవరి 24న అప్పటి బీజేపీ అధ్యక్షుడు మురళీ మనోహర్ జోషి కూడా రాజ్యాంగాన్ని కొత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందనే డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో పునరుద్ఘాటించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, కొంతమంది బీజేపీ నేతలు 'అబ్ కి బార్ 400 పార్' (ఈసారి మేము 400 దాటుతాం) అన్న నినాదం నిజమైతే, అది రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రకటించడం ప్రారంభించారు. అలా చేయాలనే ఉద్దేశం తమకు లేదని బీజేపీ చాలాసార్లు స్పష్టం చేసినప్పటికీ, రాజ్యాంగంలో భారీగా ప్రాథమిక మార్పులు చేయడానికి పార్టీ ప్రయత్నించిన ఉదాహరణలు ఉన్నాయి. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పుడు, వారు చేసిన మొదటి పని రాజ్యాంగాన్ని సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం. చాలా గందరగోళం చెలరేగిన తర్వాత వారు కమిటీ ఏర్పాటుకు గల కారణాన్ని మార్చారు. రాజ్యాంగాన్ని పూర్తిగా సమీక్షించడానికి బదులుగా, ఇప్పటివరకు రాజ్యాంగం ఎలా పనిచేసిందో కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు' అని నీలాంజన్ ముఖోపాధ్యాయ్ తెలిపారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో రాజ్యాంగాన్ని సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశారని, ప్రస్తుత రాజ్యాంగం స్థానంలో కొత్త రాజ్యాంగం ఉండాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ భావించాయని ముఖోపాధ్యాయ్ తెలిపారు. నరేంద్ర మోడీ మాత్రం 2014లో ప్రధాని అయిన వెంటనే రాజ్యాంగం భారతదేశంలోని ఏకైక పవిత్ర గ్రంథం అని, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయం అని పిలవడం ప్రారంభించారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
26.11.2025

అసమాన భారతంలో రాజ్యాంగం

పీడిత వర్గాల రక్షణకు బలమైన ఆయుధం రాజ్యాంగమే. బుద్ధుడి హృదయంతో నిర్మాణమైన అశోక సామ్రాజ్యాన్ని తిరిగి పునర్జీవింపచేయడమే రాజ్యాంగ లక్ష్యం. రాజ్యాంగ ఆశయాలైన స్వేచ్ఛ, సమానత్వం సోదరభావం వంటి విలువలను జంబూద్వీప గణ రాజ్యం నుంచి తీసుకున్నారు. వీటిని ఫ్రెంచ్ విప్లమో, ఇంకో విప్లవం నుంచో తీసుకోలేదు. కావున రాజ్యాంగ సమానత్వాన్ని సాధించాలంటే బహుజనలంతా ఏకమై సమిష్టిగా మరోసారి రాజ్యాంగ ఆయుధాలతో హక్కులు, అధికారం కోసం యుద్ధం చేయాలి. ఇదే రాజ్యాంగం నేర్పిన విప్లవ పాఠం.

సంపతి రమేశ్ మహారాజ్
7989579428

రాజ్యాంగ సభలో 26 నవంబర్1949న భారత రాజ్యాంగాన్ని ప్రవేశపెడుతున్న సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఇక నుంచి మనం విరుద్ధ సమాజంలోకి ప్రవేశిస్తున్నామన్నారు. ఎందుకంటే, సమాజంలో ప్రజల మధ్య భిన్న సామాజిక,ఆర్థిక నేపథ్యాలు ఉన్నప్పటికీ రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు ఇచ్చింది. అసమానలతో నిండిన సమాజాన్ని సమానత్వంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఉచిత విద్య, స్కాలర్‌షిప్, సంక్షేమ హాస్టల్స్, పేదరిక నిర్మూలన వంటి చర్యలతో పదేండ్లలో సమానత్వాన్ని పూర్తిచేయాలన్నారు. కానీ, ఇప్పటికి సమానత్వం రాలేదు. మరి, అసమానతలతో నిండిన భారతీయ సమాజంలో ఆ సమానత్వమే లక్ష్యంగా భారత రాజ్యాంగం ఏర్పడింది. మానవ నిర్మిత అడ్డుగోడలు కుల, మత, భాష ,ప్రాంత భేదాలను కూకటివేళ్లతో పెకిలించి సంపూర్ణ జీవితాన్ని ప్రసాదించింది. స్వేచ్ఛా, సమానత్వం, సోదర భావం వంటి మానవ విలువలను ప్రసాదించిన హక్కుల పత్రం ఇది. ఓటు హక్కు అనే ఆయుధం ద్వారా ఈ దేశ పౌరులందరికి ప్రజాస్వామ్య రాజకీయ భాగస్వామ్యాన్ని కల్పించారు. ఇది దేశ చరిత్రలోనే గొప్ప విప్లవం. పటిష్ట వ్యవస్థల సమాహారంతో అక్షరరూపం దాల్చిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలుకు వచ్చింది. రాజ్యాంగ విశిష్టతను నొక్కి చెప్పడానికి కేంద్రం 2015 నుంచి యేటా నవంబర్ 26 న రాజ్యాంగ దినోత్సవం జరుపుతోంది. ఈ సందర్భంలోనే 75 వసంతాలుగా వెలుగొందుతున్న మనం రాజ్యాంగ సామాజిక సమానత్వం ఏ మేరకు సాకారమైందనేది చర్చించుకోవాల్సిన సందర్భం ఇది.

భారత రాజ్యాంగ విశిష్టత

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దది. అంబేద్కర్ దాదాపు 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి ఒక అత్యున్నత గ్రంథాన్ని మనకు అందించారు. అటు ఏడు దశాబ్దాల దాటినా కూడా అది ఒక పవిత్ర అధికార, హక్కుల పత్రంలా మన ముందు నిలిచి ఉంది. పలు దేశాల రాజ్యంగాలు కుప్పకూలుతున్నప్పటికీ, మన రాజ్యాంగం మాత్రం పటిష్టంగా నిలబడింది. ఇతర దేశాల రాజ్యాంగాలతో పోలిస్తే మన రాజ్యాంగ విశ్వసనీయత కూడా అధికం. ప్రపంచ దేశాల రాజ్యాంగాల గురించి వర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన విద్యావేత్తలు థామస్ గిన్స్‌బర్గ్, జాకరీ ఎల్కిన్స్, జేమ్స్ మెల్టన్ అధ్యయనాలు చేశారు. వాటిని 'రాజ్యాంగాల మన్నన'((Endurance of National Constitutions) పేరుతో ప్రచురించారు. వివిధ దేశాల రాజ్యాంగాలు ఎంతకాలం కొనసాగాయి, వాటి నిర్మాణ ప్రక్రియ ఎంత ముఖ్యమైనదనే అంశాలను విశ్లేషించారు. 192 దేశాలలో 82 దేశాల రాజ్యాంగాలు రద్దయిపోయాయి. ప్రపంచ దేశాల రాజ్యాంగాల సరాసరి జీవితకాలం 17 యేండ్లు. 18 సంవత్సరాలు నిండకుండానే 50 శాతం రాజ్యాంగాలు కుప్పకూలాయి. ఆఫ్రికా దేశాల రాజ్యాంగ సగటు జీవితకాలం 10.2 సంవత్సరాలు, యూరప్ దేశాలు 32 సంవత్సరాలు, ఏషియా దేశాలు 19 సంవత్సరాలు, ఓఈసీడీ దేశాల రాజ్యాంగం 32 సంవత్సరాలుగా ఉన్నాయి. భారత రాజ్యాంగం మాత్రం 75 వసంతాలైనప్పటికీ అద్వితీయంగా వెలుగొందుతోంది. భారత ప్రజల సంపూర్ణ ఆమోదం పొందడం, పౌరుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం నిలబడడం వల్లనే ఇది సాధ్యమైంది. కాన్షీరాం, ద్రవిడ ఉద్యమం, ఉత్తరభారతంలో మొదలైన బహుజన సామాజిక, రాజకీయ ఉద్యమాలతోనే రాజ్యాంగం నిలబడింది.

రాజ్యాంగంపై కుట్రలు

రాజ్యాంగం అమలుకు వచ్చేనాటికి 560 పైగా సంస్థానాలు ఉండేవి. 90 శాతం ప్రజలు ఆకలి, నిరక్షరాస్యత, దారిద్ర్యం, వెనుకబాటుతనం వంటి సామాజిక రుగ్మతలతో



కొట్టుమిట్టాడేవారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులతో కొంత మేర అభివృద్ధి సాధించగలిగాము. ఇంకా 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలు అవకాశాలకు దూరంగానే ఉన్నారు. రాజ్యాంగం పేర్కొన్న సమానత్వం, సామాజిక న్యాయం అందని ద్రాక్షగానే మిగిలింది. రాజ్యాంగ నిర్మాతలలో ఒకరైన అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ 'నిచ్చెన మెట్ల కుల భారతంలో భారత రాజ్యాంగం మనుగడ సాగించదని' అన్నారు. ఇది నిజమే అనిపిస్తుంది. కులంతో నిర్మితమైన ఈ దేశంలో రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వానికి ఇప్పటికీ కులాధిపత్యం అడ్డు వస్తుంది. కొందరి చేతులలోనే దేశ సంపద, భూమి, అధికారం అంతా కూడా కేంద్రీకృతం కావడమే దీనికి కారణం. ధనబలం, అంగబలంతో అధికారాన్ని చేజిక్కించుకుంటున్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర పన్నుతున్నారు. వారే రాజ్యాంగాన్ని రక్షిస్తామని బయలుదేరుతున్నారు. ప్రజలను పూర్తిగా గందరగోళంలోకి నెట్టి అధికారంలోకి రావడమే వీళ్లందరి ఎత్తుగడ. కొందరు కేంద్ర మంత్రులు, తెలంగాణలో గత ముఖ్యమంత్రి కూడా రాజ్యాంగం మార్చాలన్నారు. డాక్టర్ విశారదన్ మహరాజ్ రాజ్యాంగాన్ని చేత పట్టుకుని ఒకసారి ఐదు వేల కిమీ, మరొకసారి పదివేల కిమీ పాదయాత్ర చేశారు. రాజ్యాంగ హక్కులను ప్రజలకు తెలియజేస్తూ సామాజిక, రాజకీయ చైతన్యానికి శ్రీకారం చుట్టారు. దీంతో కొంతకాలంగా రాజ్యాంగం పట్ల ప్రజలలో స్పృహ పెరిగి వెనుకబడిన వర్గాలంతా తమ వాటాను అడుగుతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో బలపడుతున్న బీసీ రిజర్వేషన్ల ఉద్యమం ఇందుకు నిదర్శనమే.

పంపిణితోనే సామాజిక న్యాయం

రాజ్యాంగం 50 వసంతాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో ఆనాటి రాష్ట్రపతి కేఆర్ నారాయణ రాజ్యాంగాన్ని మనం విఫలం చేస్తున్నామా?మనలను రాజ్యాంగం విఫలం చేస్తుందా? అని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఎంత గొప్పదైనా, అమలు పరిచే పాలకులు సరిగ్గా లేకపోతే విఫలమవుతుంది. ఇప్పటికీ దేశ పౌరులందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి కల్పించడంలో పాలకులు విఫలమయ్యారు. రాజ్యాంగాన్ని కనీసం 20 శాతం అమలుపరిచినా ఈ దేశం భూతల స్వర్గంగా మారేది. రాజ్యాంగం అంటే ప్రకరణాలు, నిబంధనల సమాహారం మాత్రమే కాదు. ఇది నవీన నాగరికతకు నాంది పలికే ఒక సజీవ పత్రం. మారుతున్న ప్రపంచంలో ప్రజా అవసరాలు, డిమాండ్లకు అనుగుణంగా మార్చుకోగల సరళత కలిగివుంది. ఇప్పటివరకు ప్రజా అవసరాల దృష్ట్యా 106 రాజ్యాంగ సవరణలు జరిగాయి. పీడిత వర్గాల రక్షణకు బలమైన ఆయుధం రాజ్యాంగమే. బుద్ధుడి హృదయంతో నిర్మాణమైన అశోక సామ్రాజ్యాన్ని తిరిగి పునర్జీవింపచేయడమే రాజ్యాంగ లక్ష్యం. రాజ్యాంగ ఆశయాలైన స్వేచ్ఛ, సమానత్వం సోదరభావం వంటి విలువలను జంబుద్వీప గణ రాజ్యం నుంచి తీసుకున్నారు. వీటిని ఫ్రెంచ్ విప్లమో, ఇంకో విప్లవం నుంచి తీసుకోలేదు. కావున రాజ్యాంగ సమానత్వాన్ని సాధించాలంటే బహుజనలంతా ఏకమై సమిష్టిగా మరోసారి రాజ్యాంగ ఆయుధాలతో హక్కులు, అధికారం కోసం యుద్ధం చేయాలి. ఇదే రాజ్యాంగం నేర్పిన విప్లవ పాఠం.

(నేడు భారత రాజ్యాంగ దినోత్సవం)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

మొక్కవోని ధైర్యంతో ముందడుగు

పాకాల సుమంత్
95503 43452

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేరు చెబితేనే బీఆర్ఎస్ పార్టీకి వణుకు పుడుతోంది. అకారణంగా ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత కూడా దాడి కొనసాగిస్తూనే ఉన్నారు ఆ పార్టీ నేతలు. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే ఏ దిక్కు లేకుండా ఆమె ఇంటిలోనే కూర్చుంటారని వారు భావించారు. కానీ, కవిత మాత్రం బీఆర్ఎస్ పార్టీ అంచనాలను తలకిందులు చేస్తూ బీఆర్ఎస్ చేయాల్సిన పోరాటాన్ని తాను భుజానికెత్తుకున్నారు. తెలంగాణ జాగృతి ద్వారా తన బాట జనం బాట అని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో తాను వెళ్లిన చోట ప్రజలు చెబుతున్న సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు గతంలో చేసిన అరాచకాలు, ఘోరాలను ప్రజలు కవిత దృష్టికి తెస్తున్నారు. దీంతో అటు ప్రభుత్వాన్ని ఎండగడుతూనే, బీఆర్ఎస్ ను ప్రశ్నిస్తున్నారు. కవిత బీఆర్ఎస్ పార్టీలో ఉండి ప్రశ్నించినా, పార్టీలో నుంచి వెళ్లిపోయాక ప్రశ్నించినా బీఆర్ఎస్ తట్టుకోలేకపోతోంది. పార్టీలో ఉన్నప్పుడే కొంతమంది బీఆర్ఎస్ నేతల వ్యవహారం గురించి ఆమె ప్రశ్నించటంతో కుట్ర చేసి పార్టీ నుంచి పంపించారు. ఆ తర్వాత కూడా కవిత ప్రశ్నించటం మానకపోవటంతో ఉడికిపోతున్నారు. ఏం చేయాలో తెలియక సిగ్గుమాలిన దాడికి తెగబడుతున్నారు. కేసీఆర్ కూతురు అన్న విషయం కూడా మర్చి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. కవితపై పిచ్చి వాగుడు వాగుతున్నారు. ఇది చాలదన్నట్లుగా సోషల్ మీడియాలో హద్దులు దాటి దాడి చేస్తున్నారు. బీఆర్ఎస్ ముఖ్యనేతలు, వారి అనుచరులు నీచానికి దిగజారి సోషల్ మీడియా లో సభ్య సమాజం సిగ్గుపడేలా దాడి చేస్తున్నారు.

ఇంత విద్వేషం ఎందుకు?

అసలు కవితపై ఇంత విద్వేషం వెదజల్లాల్సిన అవసరమేముంది? బీఆర్ఎస్ నేతల పై గతంలో వచ్చిన ఆరోపణలనే కదా ఆమె ప్రస్తావిస్తున్నారు. జనంబాటలో ప్రజలు తన దృష్టికి తెచ్చిన అంశాలను మీడియా సాక్షిగా బయటపెడుతున్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ పై ఆరోపణలు వస్తే వాటికి హుందాగా సమాధానం చెప్పాలి. కానీ కవిత విషయంలో బీఆర్ఎస్ ఈ సోయి మరిచిపోయింది. ఆమె అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిస్థితి లేకపోవటంతో కాంగ్రెస్‌తో కుమ్మక్కు అయ్యిందంటూ విష ప్రచారం మొదలు పెట్టింది. అసలు కవిత చేసిన నేరమేంటీ? హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, సంతోష్ రావు ఇలా బీఆర్ఎస్ నేతల అరాచకాలు, అక్రమాలు అవినీతిని బయటపెట్టటమేనా? ఇప్పటి వరకు కవిత సంధించిన ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతలు సరైన సమాధానం చెప్పిన దాఖలాలు లేవు. మాట్లాడితే ఎదురుదాడినే అస్త్రంగా చేసుకున్నారు.

కవిత ప్రశ్నిస్తుంటే జగదీశ్ రెడ్డి నుంచి నిరంజన్ రెడ్డి వరకు సీనియర్ నాయకులే అసహనంతో రగిలిపోతున్నారు. ఆమె పై వ్యక్తిగత దాడికి దిగుతున్నారు. ఇక వారి అనుచరులైతే సోషల్ మీడియాలో బరితెగించి పోతున్నారు.

సమాధానం లేనప్పుడే ఎదురుదాడి

ఆరోపణలకు సమాధానం లేనప్పుడే ఎదురుదాడి ఉంటుంది. కవిత చేసిన ఆరోపణల విషయంలో ఏ నాయకుడు కూడా సమాధానం చెప్పలేదు. రేవంత్ రెడ్డితో హరీశ్ రావు మిలాఖత్ అయ్యాడంటూ కవిత చేస్తున్న ఆరోపణలకు ఎన్నో ఆధారాలు చూపిస్తున్నారు. వరంగల్ జైలు బిల్డింగ్, పాల దందాతో పాటు హరీశ్ రావు అక్రమాలు, రేవంత్ రెడ్డితో కలిసి ఒకటే ఫ్లైట్ లో ప్రయాణం చేశారన్న ఆరోపణలపై హరీశ్ రావు ఇప్పటి వరకు నోరు మెదపలేదు. ఇక గతంలో హరీశ్ రావు అక్రమాల మీద చర్యలు తీసుకుంటామని గప్పాలు కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇప్పటి వరకు హరీశ్ రావు జోలికి పోవటం లేదు. అంటే, కాంగ్రెస్ తో మిలాఖత్ అయ్యిందెవరు? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేటీఆర్, కేసీఆర్ మినహా మిగతా నాయకులపై ఎందుకు కేసులు పెట్టటం లేదు? లోపాయికారిగా కాంగ్రెస్ తో మిలాఖత్ అయిన నేతలే ఇప్పుడు కవిత గారి మీద బట్ట కాల్చి మీదేసే ప్రయత్నం చేస్తున్నారు. తమపై వచ్చిన ఆరోపణలను తప్పించుకునేందుకు లిక్కర్ స్కామ్ అంటూ లిక్కర్ రాణి అంటూ తిక్క కామెంట్లు చేస్తున్నారు. కవిత బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు ఇదే నేతలు అది అక్రమ కేసు అని మాట్లాడారు. ఎప్పుడైతే కవిత వీళ్ల అక్రమాలు, అవినీతి బాగోతాలను ప్రశ్నించటం మొదలు పెట్టిందో లిక్కర్ కేసు రాగం అందుకున్నారు. లిక్కర్ కేసు అంతా బోగస్ అని స్వయంగా కేసీఆరే ప్రకటించారు. అలాంటిది కవితపై దాడి చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు లిక్కర్ కేసును ఆయుధంగా వాడుతున్నారు. తమను తాము రక్షించుకునేందుకు మరోసారి కవితపై అభాండాలు వేస్తూ తమ నిజ స్వరూపాలను బయట పెట్టుకుంటున్నారు. బీఆర్ఎస్ పై రాజకీయ కక్షతో బీజేపీ పెట్టిన కేసుకు వంత పాడటమంటే సొంత పార్టీని బద్నాం చేస్తున్నట్లు కాదా?

సోషల్ మీడియాలో శోకాలు

కవిత కారణంగా బీఆర్ఎస్ కు నష్టమవుతున్నదంటూ బీఆర్ఎస్ నాయకులు, వాళ్ల అనుచరులు సోషల్ మీడియాలో శోకాలు పెడుతున్నారు. నిజానికి బీఆర్ఎస్ లో ఉంటూనే కాంగ్రెస్, బీజేపీతో మిలాఖత్ అయిన నేతల కారణంగా పార్టీకి నష్టం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో కొంతమంది బీఆర్ఎస్ నేతల అరాచకాలతో పార్టీకి కోలుకోలేని నష్టం జరిగింది. అది గమనించకుండా కవిత కారణంగా బీఆర్ఎస్ కు నష్టమంటూ పిచ్చి వాదనలు ఎత్తుకొని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. జనం బాటలో భాగంగా కొంతమంది బీఆర్ఎస్ నేతలపై కవిత చేసిన ఆరోపణలకు ఆయా నేతలు వారి అనుచరులతో ఎదురుదాడికి దిగారే తప్ప...కవిత ప్రశ్నలకు ఒక్క దానికి కూడా సమాధానం ఇవ్వలేదు.

జనంబాటకు ప్రజలు లేరంటూ

పైగా కవిత జనంబాటకు ప్రజలు లేరంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఒక మహిళ రాష్ట్ర ప్రజల సమస్యల కోసం పోరాటం చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు, కాంగ్రెస్ నేతలు ఒక్కటై సోషల్ మీడియాలో నీచమైన దాడికి దిగజారారంటేనే కవిత జనం బాటకు ఎంత మద్దతు లభిస్తోందో అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు, దాడులకు తెగబడ్డా బెదిరే వ్యక్తి కాదు కవిత. మీరెంత దాడి చేస్తే అంత ఉద్ధృతమైన పోరాటం చేస్తుంది. అందుకే కుట్రలు మాని ప్రతిపక్షంగా ప్రజల కోసం పనిచేస్తే కొంతైనా ఆదరణ దక్కుతుంది.

(వ్యాస రచయిత తెలంగాణ జాగృతి అధికార ప్రతినిధి)

పైరసీ సమర్ధనీయమా?

నేలపూడి స్టాలిన్ బాబు
837466998

తెలుగు రాష్ట్రాలను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సినిమా అభిమానులను కుదిపేసిన ఐ బొమ్మ పైరసీ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పైరసీదారుడికి సోషల్ మీడియాలో అనూహ్య మద్దతు లభించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పైరసీపై కఠిన చట్టాలు ఉన్నాయి. అయినప్పటికీ పైరసీలు విరివిగా జరుగుతుండడానికి కారణాలేమిటి? ఐ బొమ్మ లాంటి పైరసీ వెబ్ సైట్లకు లక్షలాది మంది సబ్ స్క్రైబర్లు నమోదు కావడంలో ఆలోచించదగిన అంశాలు ఉన్నాయా? ఐ బొమ్మ పైరసీదారుడికి పెద్ద ఎత్తున మద్దతు లభించడం ఎలా సాధ్యం అయ్యింది? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశాలు. సినిమా సామాన్యుడికి అందుబాటులో ఉండడం లేదంటూ, ఆ కారణంగానే పైరసీ ఐ బొమ్మకు సబ్ స్క్రైబర్లుగా ఉన్నామంటూ కొందరు సోషల్ మీడియా ద్వారా తమ వాదనలను వినిపిస్తున్నారు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం తమకు నచ్చిన వారికి టికెట్టు రేట్లు పెంచుకునేందుకు అనుమతులు ఇస్తున్నాయని, నిర్మాణ సంస్థల చేతులలో కీలుబొమ్మలుగా మారుతున్నాయని, నిర్మాతలు, సినిమా ఆర్టిస్టులు వేల కోట్లు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని తద్వారా సామాన్య ప్రేక్షకుడు నెత్తి పైన భారం పడుతున్నదని, నిరుపేదలకు సినిమా అందని ద్రాక్షగా మారుతున్నదని బాహాటంగా చెబుతున్నారు. సినిమా టికెట్ల రేట్లు పెంచుకునేందుకు ఒక ఇదమిద్ధమైన విధివిధానాలను ప్రభుత్వాలు అనుసరించడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

డబ్బున్న నిర్మాతలకు వెన్నుదన్నుగా

డబ్బున్న నిర్మాతలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వాలు, సామాన్యుని బలి పశువును చేస్తున్నాయని సోషల్ మీడియా వేదికగా ఎలుగెత్తడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతుంది. సినిమా టికెట్ల ధరలు వేలకు చేరిపోయాయని, ఇటువంటి తరుణంలో సామాన్యులు పక్క మార్గాలను అన్వేషిస్తుండడంతోనే ఇటువంటి పైరసీదారులకు అవకాశం ఏర్పడుతున్నదని కొందరి అభిప్రాయం. ఇదే సందర్భంలో ఒక ప్రముఖ తెలుగు సినీ నిర్మాత పైరసీదారుడిని ఎన్కౌంటర్ చేయాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పోలీసులు చేయనిపక్షంలో సినీ వర్గాలే ఆ పని చేయాలంట, అటువంటి వారి రక్తం కండ్ల చూడాలంటూ ఆయన బహిరంగంగా ప్రకటించడం సంచలనంగా మారింది. తాము కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి, వేలాది మంది భాగస్వాములై రాత్రనకా పగలనకా కష్టపడి రూపొందించిన సినిమాను, ఏ సంబంధం లేని వ్యక్తులు పైరసీ ద్వారా తమను లూటీ చేయడం దారుణమని, తమ సినిమాలకు రక్షణ లేకుండా పోతున్నదని నిర్మాణ వర్గాల ఆవేదన చెందుతున్నాయి. పైరసీ అనేది

చట్ట విరుద్ధ అంశంగా పరిగణించబడుతుంది. ఇది ఎవరు చేసినా నేరమే.

తమ ధనాన్ని శ్రమని వెచ్చించి

సినీవర్గాలవారు తమ ధనాన్ని శ్రమని వెచ్చించి నిర్మిస్తున్న సినిమాలను ఎలా చూడాలో అలానే చూడాలని కానీ, వేరే మార్గాల ద్వారా చూడాలనుకోవడం సరైనది కాదు. ఇది చట్ట విరుద్ధం కూడా. ఇదే సందర్భంలో సినీ వర్గాలు ఆత్మ పరిశీలన చేసుకొని సినిమాను సామాన్యులకు అందుబాటులోనికి తెచ్చేందుకు ప్రణాళికా అబద్ధంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. వినోదం అనేది సామాన్యుడికి భారంగా మారకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. సినీ నిర్మాణ వ్యయాన్ని భారీగా పెంచుతూ దానిని ప్రేక్షకుడి నెత్తి పైన వేయాలనుకోవడం పెడ ధోరణులకు ఆస్కారం ఏర్పడే ప్రమాదం ఉంది. సాంకేతికత వేగంగా పెరుగుతున్నది. అంతే వేగంగా ప్రత్యామ్నాయ ధోరణులు పెరుగుతున్నాయి. దీని పట్ల అప్రమత్తతో ఉండాలి. సినీవర్గాలు, ప్రభుత్వాలు, ప్రజలు సమిష్టిగా వ్యవహరించి పరిష్కారం వైపు ఆలోచన చేయాలి. మరో ఐ బొమ్మకు ఆస్కారం లేకుండా చూడాలి.

(వ్యాస రచయిత సామాజిక రాజకీయ విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

మేయర్‌ను వేలు పెట్టి చూపుతారా!

- ఏక వచనంతోనే సంభోదిస్తారా?
- అలా అయితే సహించేది లేదు
- జీహెచ్ఎంసీ సమావేశంలో మేయర్ ఫైర్

ప్రతిపక్షంస్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25: పార్లమెంట్ మొదలు అసెంబ్లీ, ఆఖరికి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు కూడా రచ్చరచ్చగానే జరుగుతాయి. మాటల తూటాలతో సమావేశాలు దద్దరిల్లిపోతాయి. జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో అంశాలపై డిస్కషన్స్ కంటే, నేతల మధ్య వాగ్వాదమే ఎక్కువగా జరుగుతుంటుంది. ఈ విషయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొంత మంది కార్పొరేటర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మాట్లాడిన ఆమె కొంతమంది కార్పొరేటర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. కౌన్సిల్‌లో హుందాగా, గౌరవంగా మాట్లాడాలని సభ్యులకు సూచించారు. మేయర్‌ను 'నువ్వు, నిన్ను, నీతో' అంటూ ఏకవచనంతో సంభోదించడం ఏమిటని ప్రశ్నించారు. మేయర్ ను వేలు పెట్టి చూపవద్దని హెచ్చరించారు. కౌన్సిల్ సమావేశంలో కొత్త వారికి మాట్లాడే అవకాశం ఇద్దామన్న మేయర్, మాట్లాడే అవకాశం ఎవరికి ఇవ్వాలో తానే నిర్ణయం తీసుకుంటానన్నారు. ఎవరికి మైక్ ఇవ్వాలో తనకు ఎవరూ చెప్పాల్సిన అవసం లేదన్నారు. ప్రజలు ఈ సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తున్నారని, సభలో అందరూ హుందాగా మెలుగుతూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. సమావేశంలో మేయర్ బీఆర్ఎస్ కార్పొరేటర్ సామల హేమ మధ్య మాటల యుద్ధం నడించింది. మేయర్ కుర్చీకి గౌరవాన్ని ఎలా ఆశిస్తున్నారో కార్పొరేటర్లకు కూడా అదే విధమైన గౌరవం ఇవ్వాలని హేమ విజ్ఞప్తి చేశారు. గతంలో 'ఆఫ్రాల్ కార్పొరేటర్లు' అని మేయర్ సంభోదించారంటూ హేమ గుర్తు చేశారు

ప్రతి డివిజన్ కు రూ.2 కోట్ల అభివృద్ధి నిధులు

నగర ప్రజలకు అభివృద్ధి చెందిన పౌర వసతులను అందించాలనే లక్ష్యంతో జీహెచ్ఎంసీ సాధారణ సమావేశం మంగళవారం ముఖ్య తీర్మానం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 150 డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాల కోసం డివిజన్‌కు రూ. రెండు కోట్లు కేటాయిస్తూ తీర్మానించింది. డ్రెయినేజీ, స్ట్రీట్ లైట్లు, కాలుష్య నియంత్రణ, వర్షపు నీటి కాల్వలు, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, పబ్లిక్ సౌకర్యాల అభివృద్ధి వంటి అత్యవసర పౌర సదుపాయాల మెరుగుదలకు వినియోగించాల్సిందిగా సూచనలు జారీ అయ్యాయి. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధి, ప్రజల అవసరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిధులను పారదర్శకంగా వినియోగిస్తామని తెలిపారు.

నెహ్రూ జూలాజికల్ పార్కుకు 'ఐఎస్ఓ' సర్టిఫికేట్

- క్యూరేటర్ వసంతకు అందజేసిన మంత్రి సురేఖ
- జూ అధికారులు, సిబ్బందికి అభినందన

ప్రతిపక్షంస్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 25: నెహ్రూ జూలాజికల్ పార్కుకి 'ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేట్' లభించింది. ఈ సర్టిఫికేట్ ను జూ క్యూరేటర్ వసంతకు రాష్ట్ర అటవీ మంత్రి కొండా సురేఖ మంగళవారం నాడు సచివాలయంలో అందజేశారు. నెహ్రూ జూలాజికల్ పార్క్ వరుసగా ఆరు సంవత్సరాలు ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేషన్ పొందిన దేశంలోనే మొట్టమొదటి జూ అని వసంత తెలిపారు. ఐఎస్ఓ 9001 సర్టిఫికేట్ నాణ్యతా నిర్వహణ ప్రమాణాలను నిర్ధారిస్తుందని చెప్పారు. స్థిర సేవా నాణ్యత, సమర్థవంత, పారదర్శక అంతర్గత ప్రక్రియలు, జంతు సంరక్షణ, పెంపకంలో అనుసరించే ప్రామాణిక విధానాలు, టికెటింగ్, సందర్శకుల సేవలు, అత్యవసర ప్రతిస్పందన, సిబ్బంది శిక్షణ, నైపుణ్యాభివృద్ధి ఇక్కడ ఉన్నాయని వివరించారు. ఏ జూకైనా ఐఎస్ఓ 14001 సర్టిఫికేషన్లు పొందడం ఒక పెద్ద విజయం అని చెప్పారు. ఇది జూ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పర్యావరణ నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని సూచిస్తుందన్నారు. ఐఎస్ఓ 14001: హైదరాబాద్ జూ అందుకున్న పర్యావరణ నిర్వహణ వ్యవస్థ వ్యర్థాల ఉత్పత్తిని పర్యవేక్షించడం, తగ్గించడం, శక్తి, నీటి వినియోగం, కార్బన్ పాదముద్ర, నివాస నిర్వహణ, కాలుష్య నియంత్రణ, బాధ్యతాయుతమైన వనరుల వినియోగం మరియు పరిరక్షణ, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడంలో జంతుప్రదర్శనశాలల నిరంతర ప్రయత్నాలను సూచిస్తుందన్నారు.

హెచ్ఐఎల్‌టీపీ పాలిసీని వెంటనే రద్దు చేయాలి

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 25 : జిహెచ్ఎంసి జనరల్ బాడీ మీటింగ్ లో పారిశ్రామిక వాడల భూములను అమ్మే హెచ్ఐఎల్టిపి పాలసీని రద్దు మాజీ మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్వార్టర్స్ నుండి జిహెచ్ఎంసి కార్యాలయానికి ప్లే కార్లతో నిరసన తెలుపుతూ ర్యాలీగా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కార్పొరేటర్ తో కలిసి జిహెచ్ఎంసి కార్యాలయానికి బయలుదేరారు. అనంతరం జిహెచ్ఎంసి జనరల్ బాడీ మీటింగ్ లో కౌన్సిల్ హాల్లో కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇండస్ట్రియల్ ల్యాండ్ ని కన్వర్షన్ చేసుకునే పాలసీని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని దానికి కౌన్సిల్ హాల్ లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. సుమారు 9292 ఎకరాల స్థలాన్ని కాచేయడానికి పెద్ద ఎత్తుగడకు పాల్పడ్డారని, సుమారు 5 లక్షల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కేవలం 5000 కోట్ల రూపాయలకి వారికి కట్టబెట్టే ఆలోచన చేస్తున్నారని, దీని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు అదేవిధంగా గత రెండు సంవత్సరాల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి జిహెచ్ఎంసిలో అన్ని విభాగాలు పడకేశాయని, వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మంచినీళ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గుంతల మాయమైన రోడ్లకు కనీసం ప్యాచ్ వర్క్స్ చేయలేని పరిస్థితికి జిహెచ్ఎంసి దిగజారారని, ఎంటమాలజీ డిపార్ట్మెంట్ కనీసం కళ్లకు కనబడతలేరని వారు కౌన్సిల్ హాల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ గారి బిఆర్ఎస్ ప్రభుత్వ పది సంవత్సరాల పాలనలో ఐటీ శాఖ మాత్యులుగా కేటీఆర్ గారు జిహెచ్ఎంసి కి ప్రపంచ పటంలోనే ఒక గొప్ప స్థానాన్ని కల్పించారని ,ఎన్నో అవార్డులు రివార్డులు జిహెచ్ఎంసికి వచ్చాయని కానీ ఈరోజు ఆ పరిస్థితికి భిన్నంగా అన్ని విభాగాల అధికారుల పనితనాన్ని చూసి సిగ్గుపడాల్సి వస్తుందని అన్నారు.

కీసర గుట్ట హుండీ ఆదాయం 1.26 కోట్లు

ప్రతిపక్షం, కీసర, నవంబర్ 25: కీసర గుట్ట కార్తిక మాసం హుండీ ఆదాయం ఒక్క కోటి ఇరవై లక్షల పరిచులక ఆదాయం వచ్చింది అని ఆలయ ఈ ఓ సుధాకర్ రెడ్డి తెలిపారు.మంగళవారం కీసర గుట్ట హుండీనీ దేవాదాయ సిబ్బందితో లేకించిన ఆలయ ఈ ఓ సుధాకర్ రెడ్డి.ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పోయిన నెల అమావాస్య 22 నుండి ఈ నెల అమావాస్య 20 వరకు జరిగిన కార్తిక మాసంలో వచ్చిన హుండీ ఆదాయం మాత్రమే లేకించము అని తెలిపారు.ఈ హుండీ లెక్కింపు ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషన్ చంద్ర శేఖర్ పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కించడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ,ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ లోపలి 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం!

ప్రభుత్వ ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ ఆమోదం

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 25: ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో లేదా దానిని ఆనుకుని ఉన్న 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసి లో విలీనం చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రీయాంబుల్‌ను కార్పొరేషన్ ముందు జీహెచ్ఎంసీ ఉంచింది. పెరిఫెరల్ మున్సిపాలిటీల్లో అభివృద్ధి వ్యత్యాసాలు, వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ ఒత్తిడి వంటి అంశాలను ప్రభుత్వం ప్రస్తావిస్తూ ఏకరీతిగల ప్రణాళిక, మెరుగైన పౌరసేవలు, సమన్వయిత మెట్రోపాలిటన్ అభివృద్ధి కోసం విలీనం అవసరమని అభిప్రాయపడింది. విలీన ప్రతిపాదనలో ఉన్నవి పెద్ద అంబర్‌పేట్, జల్పల్లి, షంషాబాద్, తుర్కయాంజల్, మణికొండ, నర్సింగి, ఆదిబాట్ల, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, బోలారం, తెల్లాపూర్, అమీన్పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్ మున్సిపాలిటీలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ చట్టం-1955 ప్రకారం ఈ ప్రతిపాదనపై పరిశీలన చేసి, అవసరమైన అధ్యయనం నిర్వహించి, తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయాలని ప్రభుత్వం కోరింది. ఈ మేరకు సర్కార్ ప్రీయాంబుల్‌ను జీహెచ్ఎంసీ సర్వ సభ్య సమావేశం ముందు టేబుల్ ఐటమ్ 2 గా ఉంచారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ ఈ ప్రీయాంబుల్‌కు ఆమోదం తెలిపింది.

ప్రతి డివిజన్ కు రూ.2 కోట్ల అభివృద్ధి నిధులు

- జిహెచ్ఎంసి జనరల్ బాడీలో తీర్మానం చేసిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత

ప్రతిపక్షం , సిటి బ్యూరో , నవంబర్ 25: గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు అభివృద్ధి చెందిన పౌర వసతులను అందించాలనే లక్ష్యంతో జిహెచ్ఎంసి సాధారణ సమావేశం మంగళవారం ముఖ్యమైన తీర్మానం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 150 డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఒక్కో వార్డు/డివిజన్‌కు రూ.2 కోట్లు కేటాయిస్తూ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్ కేటాయింపులో భాగంగా: రూ.1 కోటి కార్పొరేటర్ ప్రత్యక్షంగా ప్రతిపాదించే పనులకు, రూ.1 కోటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో సమన్వయం చేస్తూ కార్పొరేటర్ ప్రతిపాదించే పనులకు మంజూరు చేయనున్నట్లు జిహెచ్ఎంసి స్పష్టంచేసింది. ఈ నిధులను రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, కాలుష్య నియంత్రణ, వర్షపు నీటి కాల్వలు, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, పబ్లిక్ సౌకర్యాల అభివృద్ధి వంటి అత్యవసర పౌర సదుపాయాల మెరుగుదలకు వినియోగించాల్సిందిగా సూచనలు జారీ అయ్యాయి. ఈ సందర్భంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్ అభివృద్ధి, ప్రజల అవసరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిధులను పారదర్శకంగా వినియోగిస్తామని తెలిపారు. నగర అభివృద్ధి పట్ల జీహెచ్ఎంసి కట్టుబాటును ప్రతిబింబించే కీలక నిర్ణయమిదని ఆమె పేర్కొన్నారు.అదనంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, తార్నాక డివిజన్‌ను ఒక మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దడంలో ఈ బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంతోనే ఈ బడ్జెట్‌కు సాంక్షన్ ఇవ్వడం వలన ఈ కేటాయింపు సాధ్యమైందని డిప్యూటీ మేయర్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. పౌర సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి వేగాన్ని మరింత పెంచేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయని డిప్యూటీ మేయర్ శ్రీలత అభిప్రాయపడ్డారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

- తలకు తీవ్రగాయం
- పోలీసుల అదుపులో నిందితుడు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 25 : ఓ వ్యక్తిని నూడుల్స్ గరిటేతో కొట్టి గాయాలపాలు చేసిన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బాకారం గ్రామానికి చెందిన ఎల్లాపల్లి సురేష్ మద్యం మత్తులో మార్ల సురేందర్ యాదవ్ తో తరచూ గొడవపడుతూ బెధిరించేవాడు. ఈ నెల 24వ తేది(సోమవారం) అర్ధరాత్రి 12.30 గంటలకు గ్రామంలోని రాందాస్ రాఘవ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కు వెళ్లాడు.అదే సమయంలో ఎల్లా పల్లి సురేష్, సురేందర్ యాదవ్ వద్దకు వచ్చి నూడుల్స్ గరిటేతో తలపై కొట్టి గాయపరిచాడు.స్థానికులు స్పందించి సురేందర్ యాదవ్ ను అలీవ్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సురేందర్ యాదవ్ సోదరుడు మార్ల మహేందర్ తన తమ్ముడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొయినాబాద్‌లో దట్టంగా పొగమంచు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 25: మొయినాబాద్ మండలంలోని గ్రామాలను పొగమంచు కమ్మేసింది. మంగళవారం తెల్లవారు జామున 4 నుంచి ఉదయం 8 గంటలు దాటినా దట్టంగా మంచు కురుస్తూనే ఉన్నది. దీంతో ఆయా మండలాలకు వెళ్లే దారుల గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పొగమంచు కారణంగా రోడ్లు కనిపించకపోవడంతో వాహనాలు మెల్లగా కదిలాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. పొగ మంచు కారణంగా 8 గంటల తర్వాత సూర్యుడు దర్శనం ఇచ్చాడు. ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు పంట పొలాల్లో ఎక్కడ చూసినా పొగమంచు పరుచుకొని అందమైన దృశ్యాలు కనువిందు చేయగా, ప్రతిపక్షం క్లిక్ మనిపించింది.

నార్కట్పల్లిలో బీసీ విద్యార్థి సంఘం మహాధర్నా

ప్రతిపక్షం, చిట్యాల, సెప్టెంబర్ 25: బీసీ రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక ఎలక్షన్లకు పోతే రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్ హెచ్చరించారు. రాజ్యాంగ బద్ధ రిజర్వేషన్లు కల్పించాలని నార్కట్ పల్లి బస్టాండ్ వద్ద ధర్నా చేశారు. చౌరస్తా వరకు మంగళవారం విద్యార్థులు, నేతలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి వంశీ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయితగోని జనార్దన్ గౌడ్, ఎడ్ల మహాలింగం, కర్నాటి యాదగిరి, నరేందర్ రెడ్డి, దాసరి కృష్ణ, ఉపేందర్, మణికంత, భాస్కర్, ఉషశ్రీ, అరవింద్ పాల్గొన్నారు.

చిట్యాల బస్టాండులో ఎదురెదురుగా బస్సులు

- పొంచి ఉన్నప్రమాదం
- ఆదేశాలిస్తానని అశోక్ కు ఆర్ఎం హామీ

ప్రతిపక్షం, చిట్యాల, సెప్టెంబర్ 25: చిట్యాల బస్ స్టాండ్ లోకి హైదరాబాద్ నుండి వచ్చే బస్సులు ఒకే దారి నుండి తిరిగి నల్గొండ, సూర్యాపేట వైపు వెళుతుండడంతో ఎదురెదురుగా బస్సులు ఢీకొని ప్రమాదాలు జరిగే ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నుండి వచ్చిన బస్సులు చిట్యాల బస్టాండ్ లోకి వచ్చి తిరిగి భువనగిరి రోడ్డు నుండి సూర్యాపేట, నల్లగొండ వైపు వెళ్లాలనే సూచనను డ్రైవర్లు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక బీజేపీ జిల్లా నాయకులు చికిలమెట్ల అశోక్, నల్గొండ ఆర్టీసీ ఆర్ఎం జాన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి తగిన ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

విమర్శల పేరుతో వ్యక్తిగత దాడులు వద్దు. మాజీ సీఎం జగన్ రోడ్డుపై కూర్చుని అపోజిషన్ స్టేటస్ కోసం రిక్వెస్ట్ చేస్తున్నట్టు క్రియేట్ చేసిన ఏఐ వీడియోపై అభ్యంతరకరం. వ్యక్తిగత దాడులు ఎప్పుడూ ఆమోదయోగ్యం కాదు. మన రాజకీయ ప్రత్యర్థులైనా సరే విమర్శలు గౌరవంగానే ఉండాలి. ఇలాంటివి చేయొద్దని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

- ఏపీ మంత్రి నారా లోకేశ్

ప్రాంతీయం

మహిళలను చైతన్యం చేస్తేనే సమాజంలో మార్పు

- ఆందోల్‌లో వడ్డీ లేని రుణాల పంపిణీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 25 : జిల్లాలోని ఆందోల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వడ్డీ లేని రుణాలను మంగళవారం పంపిణీ చేశారు. మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ & టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై చెక్కులను అందజేశారు. మహిళలను చైతన్యం చేస్తేనే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. మహిళా సాధికారతే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందోల్ నియోజకవర్గంలోని 4039 మహిళా సంఘాలకు రూ.4.52 కోట్లు, జిల్లాలో 15909 సంఘాలకు మొత్తం రూ.18.25 కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శకాలు అవుతున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను తిరిగి ఆర్థికంగా బలపరుస్తోంది అని మంత్రి దామోదర్ విమర్శించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఇందిరమ్మను అత్యధిక మెజార్టీతో ఎన్నుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇందిరమ్మ ఉక్కు మహిళ. బ్యాంకులను జాతీయాకరించిన ఘనత ఆమెదే. భూమిలేని పేదలకు భూములు కేటాయించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది కూడా ఇందిరమ్మే అని మంత్రి తెలిపారు. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తుండటం, సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూ, నర్సింగ్, పాలిటెక్నిక్, మోడల్ కాలేజీల ఏర్పాటు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్ ప్రాధాన్యతతో కొనసాగుతున్నాయని వివరించారు. మహిళలు బాధ్యత, నిబద్ధత, కుటుంబాలను నిలబెట్టే శక్తి కలిగినవారు. ఆలోచన శక్తి, తరక శక్తి మహిళల్లో అపారంగా ఉంది. వారిని విద్యావంతులు చేసి, నైపుణ్యాలను పెంపొందిస్తే సమాజ అభివృద్ధి వేగంగా జరుగుతుంది. మహిళలు కొత్త వ్యాపార ప్రణాళికలు రూపొందించి మరిన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో రూ.50 కోట్లు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయనుంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం మా ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి పేర్కొన్నారు.

84 గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- కాంగ్రెస్ పార్టీని ఓడించిన వారిని క్షమించవద్దు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 25 : సంగారెడ్డి నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.మంగళవారం మల్కాపూర్ వేంకటేశ్వ ఫక్షన్లలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన నిజమైన కార్యకర్తలకే సర్పంచ్ టికెట్లు ఇవ్వాలని సూచించారు. కష్టకాలంలో పార్టీతో ఉన్న వారినే సర్పంచ్ అభ్యర్థులుగా నిలువల న్నారు.కాంగ్రెస్‌ను ఓడించిన వారిని నేను ఎప్పటికీ క్షమించ రాదాన్నారు.84 గ్రామ పంచాయితీ లో గ్రామ సర్పంచ్‌లుగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. పార్టీ అధికారంలో లేని రోజుల్లో పార్టీ వెంట ఉన్నా కార్యకర్తలనే డబ్బులు లేకపోయిన అభ్యర్థులుగా నిలబెట్టాలని పేర్కొన్నారు.ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారిని సర్పంచ్ అభ్యర్థులుగా ఎంపిక చేయొద్దని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఉన్న గ్రామాల్లో నిజమైన కార్యకర్తలకు అవకాశం కల్పించాలన్నారు. పార్టీ లో సేవకులుగా గుర్తింపు ఉన్న కార్యకర్తల గ్రామాల్లో ఆర్థికంగా బలహీనులైయిన వారిని అభ్యర్థులుగా ఉంచాలన్నారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలు కలిసి ఆ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు తెలుప న్నారు. "సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు ప్రజల వద్దకు చేరేల అందరు కృషి చేయలని పేర్కొన్నారు. ఎవరైనా కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి కోసం పనిచేస్తే.. వారు ఎంత పెద్ద నాయకులైనా నేను క్షమించమన్నారు. సంగారెడ్డిలో పరిశ్రమల స్థాపనతో యువతకు ఉద్యోగాలు రానున్నావని పేర్కొన్నారు. సంగారెడ్డి, పటాన్ చెరు ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన కోసం నిర్మల జగ్గారెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పరిశ్రమల స్థాపన కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తేనే భూములు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పరిశ్రమలు వస్తేనే స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించానున్నామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా నిర్మల జగ్గారెడ్డి ఉంటారని మరో సారి కార్యకర్తలకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిటీ సభ్యులుగా చేర్యాల ఆంజనేయులు, నిర్మల, తోపాజి అనంత్ కిషన్, రామ్ రెడ్డి, తోగర్పల్లి ప్రభు, చిద్రుప్ప రఘు గౌడ్ లను నియమించినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని విషయాల్లో ఈ ఆరుగురు నాయకులను సంప్రదించాలని పేర్కొన్నారు. నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తమ పరిధిలోని గ్రామాలను పర్యవేక్షిస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల

ఎదుగుదలకు ప్రభుత్వం అండ

- మహిళల వ్యాపార విస్తరణకు పునాది
- ఎస్ జి హెచ్ గ్రూపులకు భారీ రుణాల మంజూరు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 25 : సంగారెడ్డి పట్టణంలోని పాత జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన మహిళా గ్రూపులకు రూ: 314.31 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలు పండగ వాతావరణంలో విజయవంతమయ్యాయని, మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఎస్ జి హెచ్ గ్రూపుల మహిళలు ఇందిరమ్మ చీరల పంపిణీలో కీలక పాత్ర పోషించారని తెలిపారు . గతంలో జిల్లాలో 150కి పైగా కొత్త ఎంటర్‌ప్రైజ్‌లు స్థాపించబడినట్లు తెలిపారు. సంగారెడ్డిలో పరిశ్రమలు, వ్యవసాయం, హార్టికల్చర్ రంగాల్లో ఉన్న అవకాశాలను సమిష్టి తత్వంతో వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టీజీఐసీసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి నినాదంతో వ్యాపార రంగంలో మహిళలను ప్రోత్సహిస్తూ వ్యాపారాల నిర్వహణకు అవసరమైన ఆర్థిక తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా ఉండాలని, ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలని ఉద్దేశంతో మహిళ ఆర్థిక ప్రగతిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలను అందిస్తుందని తెలిపారు. మహిళలు వ్యాపారరంగంలో రాణించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని, వడ్డీ లేని రుణాలు అందించడం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపర్చే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఓ జ్యోతి, అదనపు డిఆర్డిఓ సూర్యారావు , ఆత్మ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
- పార్టీ శ్రేణులకు చిరుమర్తి పిలుపు
- వంద పడకల ఆసుపత్రి పరిశీలన



ప్రతిపక్షం, చిట్యాల, సెప్టెంబర్ 25: స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి గురించి గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. రామన్నపేట లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో మంగళవారం ఆయన స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మాయమాటలను నమ్మి అధికారం ఇచ్చారని, ప్రజలు తాము చేసిన పొరపాటును గుర్తించారని అన్నారు. అలాగే నకిరేకల్‌లో రూ. 32 కోట్లతో 80 శాతం పనులు పూర్తయిన 100 పడకల ఆసుపత్రి ప్రారంభంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేయడంపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఆసుపత్రిని పరిశీలించారు. కొద్దిపాటి పెండింగ్ పనులపైనా అలసత్వం తగదని, ఆసుపత్రిని వెంటనే ప్రారంభించి ప్రజలకు సేవలందించాలన్నారు.

వనిపాకల కుమ్మరి సంఘం అధ్యక్షులుగా సైదులు

ప్రతిపక్షం, చిట్యాల, సెప్టెంబర్ 25: చిట్యాల మండలం వనిపాకల కుమ్మరి సంఘం అధ్యక్షులుగా మిడిదొడ్డి సైదులు, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి శైలేందర్, ఉపాధ్యక్షులుగా మిడిదొడ్డి వెంకన్న, సహాయ కార్యదర్శిగా మిడిదొడ్డి విజయ్, కోశాధికారిగా మిడిదొడ్డి గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తాడూరి చంద్రం తెలిపారు. సభ్యులుగా గోపాల్, సతీష్, శంకర్, దుర్గ నియమితులయ్యారు.

యథేచ్చగా మట్టి అక్రమ తవ్వకాలు

- ప్రభుత్వ భూమిని అక్రమించే ప్రయత్నం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట, నవంబర్ 25: నర్వ మండలంలోని ఉందేకోడ్ గ్రామంలో సర్వే నెంబర్ 202 లో పది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో ఎర్ర మట్టి ఉండడంతో మట్టి మాఫియా అడ్డు అదుపు లేకుండా తవ్వకాలు సాగిస్తూ రూ. లక్షల్లో అక్రమార్జనకు తెరలేపారు. గత కొంతకాలంగా రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా జేసీబీతో ట్రాక్టర్లు, టారస్ ల సహాయంతో దందా కొనసాగుతుంది. ఇదే ఆసనుగా చేసుకుని చుట్టుపక్కల రైతులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుంటున్నారని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక బిల్డర్ సోమవారం రాత్రిపూట తరలిస్తున్న సమయంలో పోలీసులకు నమ్మదగిన వ్యక్తులతో సమాచారం రావడంతో పోలీసులు అక్కడకి చేరుకోవడంతో పరారయ్యారు. గత ప్రభుత్వ హయాంలో ఆ గుట్టపై కమ్యూనిటీ పల్లె ప్రకృతి క్రింద 4 వేల మొక్కలు ఏర్పాటు చేశారు. ఆ చెట్లను తొలగించి మట్టిని తరలిస్తున్నారు. అట్టి విషయంపై తహసీల్దార్ కి పిర్యాదు చేశారు. మంగళవారం తహసీల్దార్ మల్లారెడ్డి గుట్టను పరిశీలించి వెంటనే భూమి సర్వే చేసి మట్టిని అమ్ముకున్న వ్యక్తులపై మరియు జేసీబీ ఓనర్ అలాగే భూమి కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగాలి

- అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 25: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి జాప్యం జరగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసి త్వరగా మిల్లులకు తరలించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు జానకిపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వివరాలను అదనపు కలెక్టర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లు, సరిపోను గన్నీసంచులు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ తహసీల్దార్ గుత్తికొండ సదానందం, సివిల్ సప్లై డిటి భద్రు నాయక్, జిపిఓలు లోకనాథం, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఆంగ్ల భాషలో విద్యార్థులు మెరుగ్గా ఉండాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా దర్గా కాజీపేట జాగీరు ప్రభుత్వ ప్రాథమిక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలతో పాటు అయోధ్య పురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కాజీపేట జాగీర్ ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగో తరగతులను కలెక్టర్ సందర్శించారు. నాలుగో తరగతిలో ఉపాధ్యాయురాలు ఆంగ్లంలో పాఠ్యాంశం చెబుతుండగా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాన్ని చదివించారు. తెలుగు ఆంగ్ల మాధ్యమ పాఠ్యపుస్తకాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మూడో తరగతిని కలెక్టర్ సందర్శించి గణిత సబ్జెక్టును బోధిస్తుండగా కలెక్టర్ విద్యార్థులను గణితానికి సంబంధించిన ప్రశ్నలను వేయగా విద్యార్థులు సమాధానం ఇచ్చారు. ఉపాధ్యాయురాలు బ్లాక్ బోర్డుపై కూడికలు, తీసివేతల లెక్కలను రాయగా విద్యార్థులు సమాధానాలను రాశారు. ఆంగ్లంలో పఠనం చేసిన విద్యార్థులను, లెక్కలను రాసిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అయోధ్య పురం లోని పాఠశాలలో తరగతులను కలెక్టర్ పరిశీలించి ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, అందరికీ పాఠ్యపుస్తకాలు ఇచ్చారా అని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్ను తనిఖీ చేశారు. వంట గదిలోని సరుకులను పరిశీలించి, విద్యార్థులకు వండిన భోజన పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడే విధంగా, రాసే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి విద్యార్థి పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆంగ్ల భాష లో మెరుగ్గా ఉండేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను ముందు కూర్చోబెట్టాలని సూచించారు. విద్యార్థులు ఇంగ్లీషులో మాట్లాడడం, చదవడం, రాయడం వచ్చే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ మన్మోహన్, ఎంఈవో మనోజ్ కుమార్, తహసీల్దార్ భావ్ సింగ్ పాల్గొన్నారు.

"

రాష్ట్రంలో వనరులను విద్యార్థులే కాపాడాలి. ఒక్కటే దెబ్బతో అదానీ, అంబానీని మించిపోయేలా రూ.5 లక్షల కోట్ల భూ కుంభకోణానికి సీఎం రేవంత్ రెడ్డి స్కెచ్ వేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసినట్లు, ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అరాచకాలపై ప్రజలను చైతన్యం చేసి మన తెలంగాణ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉంది.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేసీఆర్ ప్రతి పండగకి ఇస్తే.. రేవంత్ ఓట్ల కోసం ఇస్తుండు

- మహిళల సంక్షేమాన్ని నిర్లక్ష్యం కాంగ్రెస్‌చేస్తోంది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు
- సిద్దిపేటలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 25: ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందంటూ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ మండి పడ్డారు . కేసీఆర్ పాలనలో చీరెల పంపిణీ, రుణాల సహాయం విస్తృతంగా జరిగిందని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాటలు ఎక్కువ చేసి పనులు చేయడంలో వెనుకబడిందని ఆయన మండి పడ్డారు.సిద్ది పేట జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, జిల్లా కలెక్టర్ హైమవతి పాల్గొన్నారు. మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు కూడా భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి బతుకమ్మ పండుగ సందర్భంగా 18 ఏళ్లు నిండిన కోటి 30 వేల మహిళలకు చీరెలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 40 లక్షల మహిళలకు మాత్రమే చీరెలు ఇస్తూ మిగతా మహిళలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 3 లక్షల 83 వేల మహిళలు ఉన్నా, వారిలో కేవలం 1 లక్ష 99 వేల మందికే చీరెలు ఇవ్వడం అన్యాయమని ఆయన అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా వాగ్దానం చేసిన 60 వేల రూపాయలు మాత్రం ఇంకా అందలేదని ప్రశ్నించారు. పట్టణ ప్రాంతాల్లో చీరెలు, వడ్డీలేని రుణాలు అందకపోవడంపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు మొత్తం 25 వేల కోట్లకు పైగా రుణాలు తీసుకుంటే, వాటిలో కేవలం 5 వేల కోట్లకే వడ్డీలేని రుణాలు ఇవ్వడం అన్యాయమని హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20 పైసలు ఇస్తూ 80 పైసలు ఎగబెడుతున్నట్లు వ్యాఖ్యానించారు. స్త్రీ నిధి సహా అన్ని మహిళా సంఘాలకు పూర్తిస్థాయి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని మహిళా సంఘాలకు ఒక్క ఆర్టిసి బస్సు కూడా ప్రభుత్వం కేటాయించకపోవడం దురదృష్టకరమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసిన 1000 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుల అమలుపై కూడా ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పండుగల కోసం సంక్షేమ పథకాలు అందించగా, రేవంత్ రెడ్డి మాత్రం ఎన్నికల ఓట్ల కోసం పథకాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ ఎక్కడైనా పండుగ వాతావరణం నెలకొందంటె అది మహిళలతోనే సాధ్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని ఇప్పటికే జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించడం జరిగిందని, ఇప్పుడు వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని తెలిపారు. హుస్నాబాద్ మండలం మహ్మద్ పూర్ గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కొరకు రాష్ట్ర ప్రభుత్వం 30 లక్షలను డిపాజిట్ చేసిందని జిల్లాలోని అన్ని మండలాల్లో మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దె బస్సులు ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని తెలిపారు. మహిళలు ఎవరిపై ఆధారపడకూడదని, స్వయం సమృద్ధితో ఉన్నతంగా ఎదగాలని, పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి సహకారం అందించడం జరుగుతుందని, ఔత్సాహికులైన మహిళలకు ఆర్థిక తోడ్పాదుకు శిక్షణను ఇప్పించడం జరుగుతుందని అన్నారు. గోడౌన్ లు కట్టుకోవడనికి స్థలం గుర్తించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం, అడిషనల్ డిఆర్డిఓ, ఫాక్స్ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వాల కృషి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ

ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 25: దుబ్బాక ఐఓసిలో దుబ్బాక నియోజకవర్గ స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలను రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య , జిల్లా కలెక్టర్ కే హైమావతి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలతో కలిసి స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలను పంపిణీ చేశారు. దుబ్బాక నియోజకర్గానికి సంబంధించి 5 మండలాలకు గాను 3,030 స్వయం సహాయక సంఘాలకు 3 కోట్ల 21 లక్షల వడ్డీలేని రుణాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఇల్లాలు చదువు ఇంటికి వెలుగు అని ఊరికే అనలేదని, మహిళలు ఇప్పుడు సంఘంలో రాణించి సమావేశాలు పెట్టే స్థాయికి ఎదిగారు అంటే మహిళ శక్తి పట్ల చాలా గర్వంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ హైమవతి మాట్లాడుతూ ఉపాధి నిమిత్తం ప్రభుత్వం ఈ సంఘాలను తీసుకువచ్చిందని, అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందని తెలిపారు. మహిళలు వ్యాపార రంగంలో రాణించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్తా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు సేంద్రీయ వ్యవసాయం పైన దృష్టిసారించి, పండించిన పంటలను నగరాలకు తరలించి అమ్మడం ద్వారా అత్యధిక లాభాలను ఆర్జించవచ్చని తెలిపారు. 5 లక్షల వరకు వడ్డీలేని రుణాలను ప్రభుత్వం అందజేస్తుందని, పరిమితిని పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సుధీర్, తహశీల్దార్ సంజీవ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, వివిధ మండలాల సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి అగ్రస్థానం

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. మంగళవారం గజ్వేల్ ఐఓసి లో నియోజకవర్గానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ 3,718 స్వయం సహాయక సంఘాలకు 3 కోట్ల 99 లక్షలు వడ్డీలేని రుణాల పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ చీరలు ధరించి సమావేశానికి వచ్చిన మహిళలను చూస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు కలసి మెలిసి సంక్షేమ ఫలాలు పొంది ప్రతి ఒక్కరూ అందరూ లబ్ది చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, అడిషనల్ డిఆర్డిఓ సుధీర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు రేణుక, మండల సమాఖ్య అధ్యక్షులు, పలు మార్కెట్ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు సిద్దిపేటలో అందేశ్రీ సంతాప సభ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 25: సిద్దిపేట జిల్లా నిరుద్యోగ కళాకారుల ఆధ్వర్యంలో ప్రజాకవి, వాగ్గేయకారుడు అందేశ్రీ సంతాప సభ ఈ నెల 27న ఉదయం 10 గంటలకు సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించనున్నట్లు జిల్లా కమిటీ అధ్యక్షుడు పిన్నింటి దాసు, రాష్ట్ర కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీను, బుజంగం, పరమేష్‌తెలిపారు. అందేశ్రీ స్మరణను నిలుపుకోవడం మన బాధ్యత అని, తెలంగాణ సమాజానికి ఆయన ఇచ్చిన కీర్తి , పాటలను గుర్తు చేసుకోవడానికి ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అందుకే జిల్లాలోని అన్ని కవులు, కళాకారులు ఈ కార్యక్రమంలో హాజరవ్వాలని కోరారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 25: ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలల మోజులో పడి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు. సిద్దిపేట జిల్లా అక్బరుపేట భూంపల్లి మండలం మోతే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ తో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు భూంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. మోతే ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను త్వరలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర రెడ్డి అన్నారు.

మల్లన్న ఆలయ ఉత్సవ కమిటీ నియామకం

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్25: కొమురవెల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానానికి కొత్త ఉత్సవ కమిటీ చైర్మన్ తో పాటు 11 మంది డైరెక్టర్లను నియమిస్తు ఎండోమెంట్స్ శాఖ కమిషనర్ ఉత్తర్వులను మంగళవారం విడుదల చేశారు. ఈ కొత్త ఉత్సవ కమిటీ పదవీకాలం డిసెంబర్ 10, 2025 నుంచి మార్చి 21, 2026 వరకు ఉంటుంది.

ఉత్సవ కమిటీ చైర్మన్ గా నర్సింహా రెడ్డి

మల్లన్న ఆలయ ఉత్సవ కమిటీకి చైర్మన్ గా గంగం నర్సింహా రెడ్డితో పాటు మరో 11 మంది సభ్యులను నియమించారు. సభ్యులుగా చికిరి కొమరయ్య, మెరుగు నరేష్ గౌడ్, పల్లె మహేష్, వంగరి వరలక్ష్మి, నంగునూరి సత్యనారాయణ, కాటం శ్రీనివాస్, సార్ల లింగం, పయ్యవుల ప్రవీణ్ కుమార్ యాదవ్, అలుగల మల్లేశం, బొచ్చు ఎల్లయ్య, గొరిగె రవిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అంతరాష్ట్ర ముఠా అరెస్టు

- 10 లక్షల విలువ గల వస్తువులు స్వాధీనం
- నిందితులపై తొమ్మిది కేసులు నమోదు
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 25:- జిల్లాలో పరిశ్రమల ప్రాంతమైన చిన్న శంకరంపేట్, రామయంపేట్ పలు ప్రాంతాలలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మెదక్ ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారిని ప్రవేశపెట్టిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కొంతమంది యువకులు జిల్లాలోని చిన్న శంకరంపేట్ మండల కేంద్రంలో గల రాధా స్టీల్ ఫ్యాక్టరీలో పని చేయడానికి వచ్చి జీవనోపాధి దొరకకపోవడంతో రామాయంపేట, చిన్న శంకరంపేట మండలాలలోని పారిశ్రామిక ప్రాంతాలలో దొంగతనాలు చేస్తూ పోలీసులకు దొరికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిందితులు పారిశ్రామిక ప్రాంతాలలో రెక్కి నిర్వహించి డబ్బా ఆటోలో రాత్రి వేళలో రావడం జరుగుతుందని, అనంతరం దొంగలించిన వస్తువులతో ఆటోలో పారిపోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. వీరిపై ఇతర జిల్లాలో 8 కేసులు, సిద్దిపేట జిల్లాలో ఒకటి మొత్తం తొమ్మిది కేసులు నమోదయ్యాయని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వ్యక్తులు మహమ్మద్ సాదిక్ ఖాన్, బహదూర్, అనిల్, రామ్ కేవల్, ప్రదీప్ సహని, రామ్కిస్ కేవత్ ఉన్నారని, ముగ్గురు పరారీలో ఉన్నారని, వారిలో అహ్మద్, ఆసిఫ్, రాజు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. గూడ్స్ ఆటో, కటింగ్ మిషన్. ఇనుపరాడ్లు. స్క్రూ డ్రైవర్లు, సుమారు రెండు కిలోల కాపర్ వైర్లు. 6 మొబైల్స్ ఫోన్లు మొత్తం కలిపి పది లక్షల రూపాయలు విలువ గల వస్తువులను సాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును వేగంగా చేదించినందుకుగాను తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ వెంకటరాజు గౌడ్ , ఎస్సై బాలరాజ్, కానిస్టేబుల్ నాగభూషణం, భాస్కర్లను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు. పారిశ్రామిక ప్రాంతాలలో కొత్త వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, లేదా 100కు డయల్ చేయాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 25: కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పాపన్నపేట్ ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు గ్రామానికి చెందిన గడ్డమీది ఉమామహేశ్వర్(23) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య దీపికతో గత కొన్ని రోజులుగా చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం ఇంట్లో నుండి మనస్తాపంతో బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికారు. మంగళవారం ఉదయం గ్రామంలోని ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి, మృతుడి తండ్రి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు పేర్కొన్నారు.

రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేసిన ప్రభుత్వం

- చీరల పంపిణీలో ప్రభుత్వం విఫలం
- నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ "వంటేరు"

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 25: బీసీ డిక్లరేషన్ పేరిట సభలను ఏర్పాటు చేసి, రిజర్వేషన్లు అమలు చేయకుండా సర్పంచ్ ఎన్నికలకు వెళ్లడం తెలంగాణ బీసీ ప్రజలను మోసం చేయడమేనని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట సభలను ఏర్పాటు చేసి అమలు కాని రిజర్వేషన్లతో బీసీలను మోసం చేసిందని తెలిపారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా రేవంత్ రెడ్డి బీసీ ప్రజలతో చెలగాటమాడుతున్నారని, రాబోయే రోజులలో బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తుంగలో తొక్కుతారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేయలేదని, కేవలం సర్పంచ్ ఎన్నికల లో ఓట్ల కోసమే ఇందిరమ్మ చీరల పంపిణీ చేస్తున్నారని, అది కూడా ఒక్క గ్రామంలో వెయ్యి మంది మహిళలు ఉంటే కేవలం 3 వందల మంది మహిళలకు మాత్రమే బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన ఘనత కేసీఆర్ దని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల 50 వేల కోట్ల అప్పుచేసి ఏ సంక్షేమ పథకానికి ఖర్చుపెట్టారో, ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పిటిసి పంగా మల్లేశం, మాజీ ఎంపీపీ అమరావతి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, సర్పంచులు దయాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్,మాజీ ఎంపీటీసీలు స్వామి, ఆంజనేయులు, అశోక్, నాయకులు మద్దిరాజిరెడ్డి రఘుపతి రెడ్డి,ఉమర్,అహ్మద్ తదితరులున్నారు.

మూడు విడతల్లో ‘పంచాయతీ’ ఎన్నికలు

- మూడు విడతల్లో 508 పంచాయతీలు, 4,508 వార్డులు
- 4,508 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 25: గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల సంఘం పేర్కొంది. డిసెంబర్ 11న తొలి విడత, డిసెంబర్ 14న రెండో విడత, డిసెంబర్ 17న మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత నామినేషన్లు నవంబర్ 27, రెండవ విడత నవంబర్ 30, మూడవ విడత నామినేషన్లు డిసెంబర్ 3 నుండి మొదలు అవుతాయి. సిద్దిపేట జిల్లాలో మూడు విడతల్లో 508 పంచాయతీలు, 4,508 వార్డుల ఎన్నికలు జరుగుతాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. మొదటి విడతలో దౌల్తాబాద్, గజ్వేల్, జగదేవపూర్, మర్కుక్, ములుగు, రాయపోలు, వర్గల్ మండలాల్లో మొత్తం 163 గ్రామపంచాయతీలు, 1,432 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెండవ విడతలో అక్బరుపేట భూంపల్లి, బెజ్జంకి, చిన్నకోడూరు, దుబ్బాక, మిడిదొడ్డి, నంగునూరు, నారాయణరావుపేట, సిద్దిపేట గ్రామీణం, సిద్దిపేట అర్బన్, తొగుట మండలాల్లో మొత్తం 182 గ్రామపంచాయతీలు, 1,644 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. మూడవ విడతలో అక్కన్నపేట, చేర్యాల, దూల్మిట్ట,హుస్నాబాద్,కోహెడ,కొమురవెల్లి,కొండపాక, కుకునూరుపల్లి, మద్దూరు మండలాల్లో మొత్తం 163 గ్రామపంచాయతీలు, 1,432 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఇందుకోసం 4,508 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

డిసెంబర్ 12న హైకోర్టు తీర్పు పెండింగ్ ఉండగా ఇంత హడావుడిగా రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం ఎందుకు?. సెప్టెంబర్ నెలలో 42% రిజర్వేషన్లు అమలు చేయొచ్చంటూ జీవో 9 విడుదల చేశారని, నవంబర్ నెలలో 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారమే ఎన్నికలు పెడతామని మళ్లీ కొత్త జీవో తెచ్చారు.
- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ప్రాంతీయం

మంత్రులను కలిసిన సిద్దిపేట డీసీసీ చీఫ్

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 25: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన తూంకుంట అంక్షారెడ్డి మంగళవారం రాష్ట్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, శ్రీహరి, సీతక్క, ఎమ్మెల్యే రాజ్ సింగ్ ఠాకూర్ తదితరులను కలిసి సత్కరించడంతోపాటు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలుపగా, సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వచ్చేలా కృషి చేయనున్నట్లు వారితో ఆమె స్పష్టం చేశారు. వెంట గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, కాంగ్రెస్ నేతలు శివారెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్ అంటూనే బీసీలకు కాంగ్రెస్ ద్రోహం

- **42 శాతం రిజర్వేషన్ పై చట్టం చేసి ఎన్నికలకు వెళ్లాలి**
- **జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి**

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 25: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటూ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్ కల్పించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరించి సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమవడం తగదని నిలదీశారు. ముఖ్యంగా బలహీన వర్గాల మద్దతు పొందుతున్న సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుందని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్ పై చట్టబద్ధత కల్పించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే బలహీన వర్గాలను చైతన్యం చేస్తూ శాంతి యుత ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. పలు రాజకీయ పార్టీల్లోని బీసీలు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం పార్టీలకతీతంగా ఉద్యమించాలని యాదగిరి కోరారు. అయితే బీసీ రిజర్వేషన్ల పెంపు పై అసెంబ్లీ, పార్లమెంటులో చట్టం చేసి అమలయ్యేలా చూడాలని, అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించ వద్దన్నారు. రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు తగిన బడ్జెట్ కేటాయించడంతోపాటు అన్ని రంగాల్లో రిజర్వేషన్ అమలయ్యేలా ఉండాలన్నారు.

గోడౌన్ల నిర్మాణాలకు భూసేకరణ చేపట్టండి

- **రైల్వే అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే హరీష్ రావు**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 25: సిద్దిపేట జిల్లాలో రైల్వే శాఖ ద్వారా నిర్మించే గౌడౌన్ల నిర్మాణాలకు అవసరమైన భూ సేకరణ చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు జిల్లా కలెక్టర్ ని కోరారు. కలెక్టర్ కార్యాలయంలో హరీష్ రావు జిల్లా కలెక్టర్, రైల్వే అధికారులతో సమావేశం అయ్యారు. సనత్ నగర్, చర్ల పల్లి రైల్వే స్టేషన్ పరిధిలో ఉండే గోడౌన్ల మాదిరిగా సిద్దిపేట గౌడౌన్లు నిర్మాణం చెపట్టాలని, సిద్దిపేట జిల్లా నుండే సనత్ నగర్, చర్లపల్లి గోదాంలలో ధాన్యాన్ని నిలువ చేస్తున్నామని, అ మాదిరిగా గోదాంలు సిద్దిపేటలో నిర్మించాలని సూచించారు. అందుకే భూసేకరణ చెప్పట్టాలని చెప్పారు. జిల్లాలో రైల్వే లైన్ ను అనుకోని ఉన్న అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించి పరిశీలించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవోని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు నవ్యశ్రీ, విద్యాధర్, మూర్తి, జనర్దన్ తదితరులు ఉన్నారు.

కమ్ముకుంటున్న పొగ మంచు

రెండు రోజుల నుంచి దట్టంగా పొగ కమ్ముకున్నట్లుగా మంచు కురుస్తున్నది. దీంతో రహదారులపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు కురుస్తుండడంతో ఎదురుగా పది మీటర్లు దూరంలోని వ్యక్తులు, వస్తువులు, వాహనాలు కనిపించడం లేదు. వాహనదారులు తమ వాహనాల లైట్లు వేసుకుని వస్తున్నా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రతిపక్షం, నంగునూరు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- **మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 25: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా తీసుకుంటున్న కీలక చర్యలలో భాగంగా మహిళా సంఘాలకు భారీ స్థాయిలో వడ్డీలేని రుణాలను విడుదల చేసింది. మొత్తం 304 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలను ప్రభుత్వం ఆమోదించి, వాటి పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లోని తన అధికారిక నివాసంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని 7 మండలాల స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ నియోజకవర్గంలో ఉన్న 5329 మహిళా సంఘాలకు కలిపి 5 కోట్లు 66 లక్షల 16 వేల రూపాయల వడ్డీలేని రుణాలు మంజూరు చేయబడ్డాయి. అందులో సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకే 2165 సంఘాలకు 2.49 కోట్ల రూపాయల రుణాలను చెక్కుల రూపంలో మంత్రి అందించారు. హుస్నాబాద్ మండలంలోని 445 సంఘాలకు 46 లక్షల రూపాయలు, అక్కన్నపేట మండలంలోని 754 సంఘాలకు 85 లక్షల రూపాయలు, కోహెడ మండలంలోని 964 సంఘాలకు మొత్తం 1 కోటి 18 లక్షల రూపాయల వడ్డీలేని రుణాలు పంపిణీ చేయబడ్డాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మహిళల ఆర్థిక పురోగతిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తుందని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుండేదని, అవసరమైతే మరిన్ని నిధులను కేటాయించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. పరిశ్రమలు స్థాపించేందుకు మహిళలు ముందుకు వస్తే బ్యాంకులు కూడా ఇకపై సులభంగా రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

- **బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 25 :- 29న నిర్వహించనున్న దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, నియోజవర్గ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ రెడ్డి, జిల్లా ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. దీక్ష దివస్ రోజు నిర్వహించే కార్యక్రమాల గురించి నాయకులతో కలసి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజు నవంబర్ 29 అన్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో..' అన్న నినాదమే ఉద్యమానికి ఊపిరైందన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్రం మెడలు వంచిందన్నారు. ఆ దీక్షతోటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. దీక్ష దివస్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ పీఏసీఎస్ చైర్మన్ రెడ్డి, పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మెదక్, హవేళీఘనపూర్, శంకరంపేట (ఆర్) పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్, సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, పట్లోరి రాజు, గంగుల విష్ణువర్ధన్ రెడ్డి, పట్టణ పార్టీ కో కన్వీనర్లు లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు విశ్వం, భీమరి కిషోర్, ఆర్కే శ్రీనివాస్, మాయ మల్లేశం, నార్సింగ్ మాజీ వైస్ ఎంపీపీ సుజాత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక అభివృద్ధికి వడ్డీ రాయితీ రుణాలు

- **ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 25 :- పాపన్నపేట మండలం పొడ్చన్ పల్లి రైతు వేదికలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం విలువలను కొనసాగిస్తూ రైతులు, పేదల పక్షపాతిగా పనిచేస్తోందన్నారు. మహిళల సమగ్ర అభివృద్ధి కోసం ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం, ఉచిత కరెంట్, వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళ శక్తి చీరలు వంటి పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. గృహరహితులకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తున్నట్టు చెప్పారు. రుణాలు మహిళల్లో ధైర్యం, నమ్మకం పెంపొందిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు ఒకే రంగానికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. అదనపు కలెక్టర్ నగేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వడ్డీ రాయితీ కింద 30.50 కోట్ల చెక్కులు అందజేశామని, ఈ రోజు 11 వేల మహిళలకు 8.89 కోట్లు రాయితీగా అందించామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా 4 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్లు, 100 కోట్ల రూపాయల లబ్ధి అందుకున్నారని చెప్పారు. గృహ జ్యోతి పథకం కింద 28.65 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు.

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు

- **జిల్లా కలెక్టర్ హైమవతి**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 25: రబీ సీజన్ కోసం అవసరమైన పరికరాలను సబ్సిడీపై అందించడం ద్వారా రైతులకు మద్దతునందిస్తున్నామని జిల్లా కలెక్టర్ హైమవతి తెలిపారు. సిద్దిపేటలోని ఐడిఓసి ఆవరణలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025-26 లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎంపికైన 171 మంది మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలను అందజేశారు. సిద్దిపేట జిల్లాకు ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 కోటి 7 లక్షల 80 వేల నిధులను మంజూరు చేసిందని, ఈ నిధులతో సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, మానకొండూర్, జనగాం నియోజకవర్గాల మహిళా రైతులకు యంత్ర పరికరాలు సబ్సిడీపై అందించడం జరుగుతుందని అధికారులు వివరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వినియోగం సంవత్సరానికో కొత్త దశను చేరుకుంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళా రైతులు యాంత్రీకరణను మరింతగా వినియోగించి ఉత్పాదకతను పెంచుకోవాలన్నారు. ఆయిల్ పామ్ సాగు రైతులు కోరుతున్న బ్రష్ కట్టర్ తదితర యంత్రాలను కూడా త్వరితగతిన అందజేసే ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ స్వరూపరాణి, సహాయ సంచాలకులు, ఇతర శాఖాధికారులు, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.

పూత-మొగ్గ దశలోకి కంది పంట

- **పర్యవేక్షణే ప్రధాన ఆయుధం: శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి**
- **పురుగుల విజృంభణపై ప్రత్యేక కథనం**

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 25: కంది పంట ప్రస్తుతం కీలకమైన పూత-మొగ్గ దశలోకి ప్రవేశిస్తోంది. ఈ సమయంలో పంటపై అనేక రకాల హానికర పురుగులు దాడి చేసే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, రైతులు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని రైతు విజ్ఞాన కేంద్రం-సిద్దిపేట కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి సూచించారు. గత కొన్ని రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు, తేమఎండల మార్పిడి, అలాగే పంటకాలాన్ని పొడిగించడం వంటి పరిస్థితులు పురుగు ప్రబలికకు అనుకూలిస్తున్నాయని ఆమె తెలిపారు.

మారుక మచ్చల పురుగు:

కంది పంటలో ప్రధానంగా భయపెట్టే పురుగుల్లో మారుక మచ్చల పురుగు ఒకటి. ఈ పురుగుల పిల్లలు పువ్వుల లోని లేత భాగాలు, మొగ్గలు, ఆకులు, పిందెలు, కాయలు అన్నీ గూడుగా చేసి తినేస్తాయి. గూళ్లలో దాగి ఉండటం వలన సహజ శత్రువులకు కనిపించకపోవడమే కాకుండా రసాయన మందుల ప్రభావం కూడా తగ్గుతుంది. అందువల్ల పూత దశకు చేరకముందే సస్యరక్షణ చర్యలు ప్రారంభించడం అత్యవసరం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పురుగు ఉధృతిని బట్టి వేపనూనె లేదా అవసరమైన రసాయన మందులతో పిచికారి చేయాలని సూచించారు. ఉధృతి గరిష్టమైందని గుర్తించినప్పుడు ఇమామెక్టిన్ బెంజోయేట్, స్పైనోశాడ్ వంటి పురుగు మందులు ప్రయోజనకరంగా ఉన్నాయని పరిశోధనలతో నిరూపితమైంది.

శనగ పచ్చ పురుగు:

శనగ పచ్చ పురుగు కంది రైతులకు మరో పెద్ద సవాలు. తొలిదశలో పువ్వులు, పువ్వు మొగ్గలు తింటూ ప్రారంభమై, పెరుగుతున్న కాయల్లో గుండ్రటి రంధ్రాలు పెడుతూ లోపలి గింజలను పూర్తిగా తినేస్తుంది. ఈ పురుగు వల్ల కాయలు నిండకపోవటం, దిగుబడి భారీగా పడిపోవటం వంటి నష్టాలు సంభవిస్తాయి. శాస్త్రవేత్తలు సూచనల ప్రకారం, ప్రతి ఎకరాకు 8-10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ పురుగుల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు. పూతమొగ్గ దశలో వేపనూనెతో పాటు అవసరాన్ని బట్టి ఆధునిక పురుగు మందులు వాడితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

కాయ తొలిచే ఈగ:

పూతపిందె దశలో బెట్ట వాతావరణం ఉంటే కాయ తొలిచే ఈగ దాడి చేసే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పొలం ఎక్కువకాలం పచ్చగా ఉండే రకాల్లో, దీర్ఘకాలిక సాగులో ఈ ఈగ ప్రబలుతుంది. తల్లి ఈగ లేత పిందెల్లోనే గ్రుడ్లు పెడుతుంది. వాటి నుండి బయలుదేరిన పురుగులు పెరుగుతున్న గింజలను తింటూ కాయలు పనికిరాకుండా చేస్తాయి. నాణ్యతా నష్టం కూడా అధికంగా ఉంటుంది. ఈ పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ పిచికారి ప్రభావంతమని డాక్టర్ పల్లవి తెలిపారు.

పర్యవేక్షణే ప్రధాన ఆయుధం

ప్రస్తుతం కంది రైతులు ప్రతి రెండు రోజులకు ఒకసారి పంటను పరిశీలించడం, పురుగు లక్షణాలు గమనించగానే వెంటనే చర్యలు తీసుకోవడం అత్యవసరం. పంటను దశలవారీగా రక్షిస్తేనే మంచి దిగుబడి సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. పూత దశ అనేది పంట యొక్క హృదయదశ. ఈ సమయంలో తీసుకునే జాగ్రత్తలు రైతుల చేతుల్లోనే ఉన్న సంపదను కాపాడుతాయి అని డాక్టర్ పల్లవి రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ రబీ సీజన్‌లో కంది పంట పెంచుతున్న రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పంటను పురుగుల దాడి నుండి రక్షించి, మెరుగైన దిగుబడిని పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



'ఆంధ్రా కింగ్ తాలూకా' హీరోయిన్‌భాగ్యశ్రీ బోర్సేతో తాను డేటింగ్లో ఉన్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. నేను ఈ సినిమాకి లవ్ సాంగ్ రాయడం, మా మధ్య కెమిస్ట్రీ బాగా కుదరడం వల్ల ఆ ప్రచారం మొదలైంది. కానీ ఆ పాట రాసిన సమయంలో సినిమాకు హీరోయిన్ను ఖరారు చేయలేదు. తాము మంచి స్నేహితులం మాత్రమే.

- హీరో రామ్‌పోతినేని

మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలి

- ప్రజా సంక్షేమానికి పథకాల అమలు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- వేములవాడ, సిరిసిల్లలో రూ. 8 కోట్ల 12 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ

ప్రతిపక్షం, వేములవాడ/ రాజన్న సిరిసిల్ల, నవంబర్ - 25: మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. ఇందిరా మహిళా శక్తి కింద 8,871 ఎస్ హెచ్ జీలకు రూ.8 కోట్ల 12 లక్షల చెక్కులను వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో ఎస్ హెచ్ జీలకు వడ్డీ రుణాలు పంపిణీ చేశామని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకు రూ. 100 కోట్ల చెల్లింపులు

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇప్పటిదాకా రూ. 100 కోట్ల 10 లక్షల ఆర్థిక సహాయం రాష్ట్ర ప్రభుత్వం చేసిందని వెల్లడించారు. మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరలు జిల్లాలో ఇప్పటి దాకా 1,14,000 చీరలు పంపిణీ చేశామని తెలిపారు. మిగతా మహిళలకు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, వారి కుటుంబ సభ్యుల పేర్లను చేర్చామని పేర్కొన్నారు. వేములవాడ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రూ. 150 కోట్లతో ఆలయ విస్తరణ పనులు మొదలు పెట్టామని, జిల్లాలో దాదాపు రూ. 700 కోట్లకు పైగా నిధులతో సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు శంకుస్థాపన చేశారని వెల్లడించారు. మూలవాగు పై బ్రిడ్జి, ఆలయం నుంచి రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. భీమేశ్వర ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయిస్తున్నామని విప్ పేర్కొన్నారు. జిల్లాలో కొత్తగా 5,560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెంది ఉన్నత స్థానాలకు ఎదగాలని, మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్లు స్వరూపారెడ్డి, విజయ, సాబేర బేగం, రాణి, చైర్మెన్ రాములు నాయక్, తిరుపతి, రాజు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల కోసం పని చేయడమే లక్ష్యం

- వడ్డీలేని రుణాల పరిమితిని పెంచాలి
- మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం చేర్యాల/కొమురవెల్లి, నవంబర్ 25: రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం పని చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగాం నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాల్లోని స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమం ముస్యాల రైతు వేదికలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. చేర్యాల, మద్దూరు, దుల్మిట్ట, కొమురవెల్లి మండలాలకు చెందిన 1541 స్వయం సహాయక సంఘాలకు మొత్తం 1 కోటి 55 లక్షల రూపాయల వడ్డీలేని రుణాలు మంజూరు చేశారు.జిల్లా మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని కలెక్టర్ హైమావతి వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, చేర్యాల ఆసుపత్రి ప్రారంభం వారి కృషి ఫలితమని అభినందించారు. వడ్డీలేని రుణాల కార్యక్రమానికి కలెక్టర్ రాత్రి సమాచారం ఇచ్చినా, మహిళలతో కలవాలనే ఉద్దేశంతో తప్పకుండా హాజరయ్యానని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి మద్దూరు మండలం రేబర్తి గ్రామానికి చెందిన అందెశ్రీ రాసిన 'జయ జయ హే తెలంగాణ' పాట స్ఫూర్తిగా నిలిచిందని స్మరించుకున్నారు. మహిళా సంఘాలు బ్రహ్మాండంగా పనిచేస్తున్నాయని, రుణాల చెల్లింపులో ముందుండటం అభినందనీయం అని పేర్కొన్నారు. వడ్డీలేని రుణాల పరిమితిని ఐదు లక్షలకు పైగా పెంచాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీఓ సుధీర్, మండల సమాఖ్య అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ పనులు పరిశీలన

- అధికారులకు ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్ సూచనలు

ప్రతిపక్షం, వేములవాడ, నవంబర్ - 25: వేములవాడ శ్రీ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆలయ దక్షిణ భాగంలో భారీ యంత్రాలతో చేస్తున్న పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు వేములవాడ ఆర్టీసీ డిపో సమీపంలోని నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మిస్తున్నారు? ఎప్పటి వరకు పూర్తి చేస్తారో ఆరా తీశారు. మొత్తం రూ. 5 కోట్ల 61 లక్షల వ్యయంతో 144 ఇండ్లు నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు. అక్కడి నుంచి నేరుగా మూలవాగుపై నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి పనులను, వేములవాడ ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బస్ స్టాండ్ వరకు నిర్మిస్తున్న రోడ్డు, డ్రైనేజ్ పనులను పరిశీలించారు. భీమేశ్వర ఆలయంలో భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. షవర్లు, కళ్యాణకట్ట, క్యూ లైన్లు పరిశీలించి, ఆలయ ఈఓ, ఇంజనీరింగ్ అధికారులకు విప్, ఇంచార్జి కలెక్టర్ సూచనలు చేశారు.

భీమేశ్వర ఆలయంలో పూజలు

భీమేశ్వర ఆలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా విప్, ఇంచార్జి కలెక్టర్ కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఇంచార్జి కలెక్టర్ ను ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జనరల్ 242 బీసీలకు 125 స్థానాలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 25 : జిల్లాలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 545 సర్పంచులు, 5022 వార్డు స్థానాలకు కేటాయించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్ల వివరాలను అధికారులు సోమవారం ప్రకటించటంతో గ్రామలలో నెలకొన్న ఉత్కంఠతకు తెర పడింది. ఇందులో జనరల్ 242, బీసీలకు 125 స్థానాలు దక్కాయి. జిల్లాలో కొత్తగా ఏర్పడిన ఆలూరు లింకేశ్వర్ పోతంగల్ సాలూర మండలాల్లో జనాభా ప్రతిపాదికన తొలిసారి రిజర్వేషన్లు అమలు చేశారు. ఇతర మండలాల్లో రొటేషన్ పద్ధతి అవలంబించారు. అధికారులు ప్రకటించిన రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.

సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ..

	మొత్తం	మహిళా	జనరల్
ఎస్టీ	96	41	55
ఎస్సీ	82	35	47
బీసీ	125	55	70
జనరల్	242	113	129
వార్డుల రిజర్వేషన్లు....			
ఎస్టీ	836	364	472
ఎస్సీ	808	301	507
బీసీ	1107	437	670
జనరల్	2271	1050	1221

మహిళా సాధికారత దిశగా ముందుకు

- మహిళలని కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 25 :- రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా మరోసారి రాష్ట్రంలోని మూడు లక్షల 50 వేల స్వయం సహాయక మహిళా సంఘాలకు 304 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందించనున్నదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మంగళవారం శంకరంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, అదనపు కలెక్టర్ నగేష్ హాజరయ్యారు. జిల్లాకు సంబంధించి 30 కోట్ల రూపాయలు నియోజకవర్గానికి సంబంధించి రెండు కోట్ల 88 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. చిన్న శంకరంపేట మండలంలోని కోరిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తున్నదని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్ప గుడిలో అన్నదానం ప్రారంభం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 25: హుస్నాబాద్ పట్టణంలోని అయ్యప్ప దేవస్థానంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం ప్రారంభోత్సవం జరిగింది. జనవరి 1 వరకు ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కావున అయ్యప్ప స్వాములు, భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవస్థానం కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్, అయ్యప్ప భక్తులు సురేందర్ రెడ్డి, శ్రీకాంత్, శివరాం, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిరెడ్డి, ఆలయ అర్చకుడు భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సర్పంచులను ఏకగ్రీవం చేస్తే 10 లక్షలు ఇస్తా

- కేంద్ర మంత్రి బండి సంజయ్ బంపర్ ఆఫర్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 25: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఆ గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.10 లక్షల నిధులను అందజేస్తానని కేంద్ర మంత్రి ప్రకటించారు. తాను ఒక్కసారి మాట ఇస్తే తప్పే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ప్రజలను ఏకం చేసి అభివృద్ధి వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించేందుకే ఈ నిధులను ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు బండి సంజయ్ ఈరోజు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.5 లక్షల ప్రోత్సాహక నిధులిస్తామని హామీ ఇవ్వడంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 70 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేశారు. కానీ ఐదేళ్లయినా ఆయా గ్రామాలకు కేసీఆర్ ప్రభుత్వం నయాపైసా ఇవ్వకుండా మొండి చేయి చూపిందని ఈసారీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తోంది నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రమేనన్నారు. భవిష్యత్తులోనూ గ్రామాలకు నిధులిచ్చేది కేంద్ర ప్రభుత్వమే అన్నారు. నిధులు ఇచ్చేది, తెచ్చేది బీజేపీ మాత్రమే అన్నారు.

రిజర్వేషన్లపై బీసీలకు అన్యాయం

- బీజేపీ రాష్ట్ర నాయకులు వీరబెల్లి రఘునాథ్

ప్రతిపక్షం, మంచిర్యాల, నవంబర్ 25: రాష్ట్రంలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు పూర్తిగా అన్యాయం చేస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరవెల్లి రఘునాథ్ ఆలపించారు. మంగళవారం లక్సెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండలాల బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు మరిచిందన్నారు. బీసీలు రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ వారికి జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించడంలో విఫలమైందన్నారు. జిల్లాలో 306 స్థానాలు ఉండగా కేవలం 23 స్థానాలను కేటాయించడం బాధాకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర గౌడ్, కృష్ణమూర్తి, ముత్య సత్తన్న, వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

సర్కారు తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

- అట్టహాసంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 25 : మహిళా సాధికారత సాధనలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గుర్తు చేశారు. బోధన శాసనసభ నియోజకవర్గం పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు మంగళవారం బోధన్ పట్టణంలోని రోటరీ భవన్ కాన్ఫరెన్స్ హాల్ లో వడ్డీ లేని రుణాల చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సెగ్మెంట్ పరిధిలోని 3703 సంఘాలకు వడ్డీ లేని రుణాల రూపేణా ప్రభుత్వం రూ. 4.28 కోట్ల నిధులను వారి ఖాతాలలో జమ చేసింది. ఈ మేరకు మహిళా సమాఖ్యకు కలెక్టర్ లాంచనంగా చెక్కును పంపిణీ చేశారు. నల్గొండ తరువాత రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాకు వడ్డీ లేని రుణాల కింద ప్రభుత్వం 23.26 కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఇతోధిక తోడ్పాటు గురించి ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, సమాఖ్య ప్రతినిధులు ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు ప్రకటించారు. బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలతో వ్యాపార లావాదేవీల నిర్వహణ ద్వారా సాధించిన ఆర్థిక ప్రగతి గురించి వివరిస్తూ, తోటి సభ్యులలో స్ఫూర్తిని పెంపొందించారు. నాణ్యతతో కూడుకుని ఆకర్షణీయంగా ఉన్న ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తుండడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ఆయా కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడమే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, యూనిఫాంల స్టిచింగ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు వంటి వాటిని సైతం మంజూరు చేస్తోందని గుర్తు చేశారు. కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కాకుండా సామాజిక అభివృద్ధిని సైతం సాధించేలా మహిళలను చైతన్యవంతులను చేయాలని సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. మహిళల గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసేలా ప్రభుత్వం 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తోందని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో రూ. 67కోట్ల రుణాలు అందజేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసిల్దార్ విఠల్, ఐ.కే.పీ డీపీఎం రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా సంగీతం శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25: రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సంగీతం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో లో సంగీతం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ,పేద ప్రజలకు సేవలు అందించాలని, ప్రభుత్వం అందించే 6గ్యారంటీ లు ప్రజలకు చేరేలా చూడాలని కోరారు. సంస్థ గతంగా పార్టీ ని బలోపేతం చేయాలని, పార్టీ కోసం పని చేస్తున్న యువతకు ఉన్నత స్థానం ఉంటుందని పేర్కొన్నారు. రానున్న గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో చురుకుగా పాల్గొని పార్టీని ముందుకు నడపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ,కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సురా దేవరాజు,దొమ్మాట నర్సయ్య ఎల్లారెడ్డి పేట మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ షేక్ సాబేరా బేగం పార్టీ జిల్లా, మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గన్నారు.

“

రష్యా, ఉక్రెయిన్ మధ్య వీలైనంత త్వరగా శాంతి నెలకొంటుందని భావిస్తున్నా. యుద్ధాన్ని ముగించేందుకు వారం రోజులుగా పీస్ ప్లాన్పై వర్క్ చేస్తున్నా. యూఎస్ ప్రతిపాదించిన 28 పాయింట్ల ప్లాన్కు ఇరు దేశాలు కొన్ని ఇన్పుట్స్ ఇచ్చాయి. కొన్నింటికి అంగీకారం రావాల్సి ఉంది. ఈ డీల్ ఫైనల్ అయ్యాకే పుతిన్, జెలెన్స్కీతో సమావేశం అవుతా.
-అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ప్రాంతీయం

పెద్దపల్లి ఎంపీకి ప్రొటోకాల్ పాటించకపోవడం సరైందికాదు

- అధికారుల తీరు మార్చుకోవాలి
- కాంగ్రెస్ నాయకులు సుదర్శన్, నర్సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్25: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ పేరు చేర్చకుండా, కార్యక్రమాలకు పిలువకుండా పెద్దపల్లి జిల్లా అధికారులు ప్రొటోకాల్ విస్మరిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సొత్కు సుదర్శన్, పైడిమల్ల నర్సింగ్ అన్నారు. మంగళవారం మందమర్రిలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో కాళేశ్వరం పుష్కరాల్లో ఎంపీకీ ఆహ్వానం లేదని, ఫొటో కూడా పెట్టలేదని ధ్వజమెత్తారు. పార్టీల మధ్య విభేధాలు ఉంటే నాయకులు చూసుకుంటారని, అధికారులు ఒక వర్గం వైపు వత్తాసు పలకడం మంచిదికాదన్నారు. ఇటీవల ఇందిరమ్మ చీరెల పంపిణీలో సైతం ఎంపీని ఆహ్వానించకుండా దారుణమన్నారు. అక్కడి అధికారుల తీరుకు నిరసనగా తాము ఆందోళన చేపడుతామని, త్వరలోనే దీనికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జాతీయ నాయకులు రాహుల్‌గాంధీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర రాజు, పవన్, ఇసాక్, రాజు కుమార్, రాయబారపు కిరణ్, జావీద్‌కాన్, శశిధర్, శేఖర్, తిరుపతి, పోలు సంపత్, చోటు తదితరులు పాల్గొన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులు.. ప్రభుత్వ సంకల్పం

- రాష్ట్రంలోని 3లక్షల 50 వేల స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.304 కోట్ల వడ్డీ లేని రుణాలు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 25: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా మరోసారి రాష్ట్రంలోని 3లక్షల 50 వేల స్వయం సహాయక మహిళా సంఘాలకు 304 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందించనున్నదని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోనీ భిక్కనూర్ మండల కేంద్రం లోని ఎస్వి గార్డెన్ లో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, అదనపు కలెక్టర్ విక్టర్ స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంఘాలకు రూ.304 కోట్ల వడ్డీలేని రుణాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి రూ.3కోట్ల 25 లక్షలు నియోజకవర్గానికి సంబంధించి చెక్కులను అందజేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ లేని రుణాలను మూడో విడత అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు వడ్డీ లేని రుణాలను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మాటిచ్చాం ఇప్పుడు నిరూపిస్తున్నామన్నారు. మహిళలను వారి కాళ్ళ మీద వారిని నిలబడేలా తీర్చిదిద్ది కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు, దృఢ సంకల్పంతో ఉన్నామని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయంగా తమ కుటుంబాలను నిలదొక్కుకొని చింతలేని కుటుంబం గా చేయాలని, ప్రజా ప్రభుత్వ హామీ మేరకు మహిళలకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.

మహిళలకు అనేక సంక్షేమ పథకాలు : పీసీసీ చీఫ్

ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిందన్నారు. మహిళా సంఘాలకు పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే పనిని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అప్పగించిందన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను కల్పించడం, ఇటీవల కాలంలో పెట్రోల్ బంకుల నిర్వహణను కూడా మహిళలకు అప్పగించిందన్నారు. అంతేకాక ప్రతి జిల్లా కేంద్రంలో ఎంపిక చేసిన ప్రాంతాలలో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయడమే కాకుండా, వికలాంగులు, జెండర్ సమస్యల కోసం సామాజిక కార్యక్రమాల నిర్వహణ, గ్రామ సంఘాలకు, మండల సమాఖ్యలకు భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం కల్పిస్తున్నదని అన్నారు. మహిళలకు పెట్రోల్ బంకులు కేటాయిస్తున్నామని, ఇందులో భాగంగానే ప్రతి సంవత్సరం మహిళలకు వడ్డీ లేని రుణాలను పెద్ద మొత్తంలో ఇస్తున్నారని అన్నారు.

బాన్సువాడలో.....

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్ లో డ్వాక్రా మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాల రాయితీ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు గాను 3465 మహిళా సంఘాలకు 3 కోట్ల 60 లక్షల రూపాయల వడ్డీలేని రుణ రాయితీ చెక్కును మహిళా సంఘాలకు పోచారం అందించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రామగుండంలో రాక్షస పాలన రాజ్యమేలుతోంది

- మైసమ్మ గుళ్లను కూల్చిన వారిని కఠినంగా శిక్షించాలి
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 25: రామగుండంలో రాక్షస పాలన రాజ్యమెలుతుందని, ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఒక నియంతలా పరిపాలన చేస్తున్నాడని, మైసమ్మ గుళ్లను కూల్చిన వారిని కఠినంగా శిక్షించాలని, సింగరేణి నిర్మానం చేస్తున్న నూతన వ్యాపార సముదాయంలో కూల్చివేతలకు గురైన చిరువ్యాపారులకు ఉచితంగా దుకణాలు ఇవ్వాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. కూల్చివేతకు గురైన చిరు వ్యాపారులకు సింగరేణి నిర్మాణం చేస్తున్న నూతన వ్యాపార సముదాయాలు ఉచితంగా అందించాలని, అదే విధంగా దారి మైసమ్మ గుడులను కూల్చిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. ర్యాలి గా బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే చందర్, పార్టీ శ్రేణులను పోలీసులు అరెస్టు చేసి జైపూర్ పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో బోడ్డు రవీందర్, బాదె అంజలి చెలకలపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, జక్కుల తిరుపతి, దొమ్మేటి వాసు, బుర్రి వెంకటేష్, శ్రీనివాస్, నీరటి శ్రీనివాస్, శ్రావన్, జిట్టవేన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 25 : దస్తూరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఐ సామాజిక కార్యకర్తల ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సయ్యద్ కలీం మాట్లాడుతూ విద్యార్థులకు దరఖాస్తు చేసే విధానంపై అవగాహన కల్పించారు తదనంతరం మాట్లాడుతూ మానవ హక్కులు ఇతర చట్టాల పైన విద్యార్థులు పూర్తిస్థాయి అవగాహనతో ఉండి సమాజ మార్పు కోసం కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో హెచ్ ఎం తునికి గంగాధర్ ఉపాధ్యాయులు జె దేవరావు బి సంజీవ్ జిల్లా ప్రచార కార్యదర్శి నవీన్ సారంగాపూర్ మండలం బాధ్యులు సయ్యద్ అలీ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్లను రద్దు చేయాల్సిందే

- కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్ 25: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఉద్యోగ వ్యతిరేక లేబర్‌కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మందమర్రి ఏరియాలోని అన్ని గనుల డిపార్టుమెంట్ల వద్ద కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్మిహించారు. ఉద్యోగులకు నల్ల బ్యాడ్జీలు పెట్టి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, మేడిపల్లి సంపత్, రాంశెట్టి నరేందర్, బీమనాథుని సుదర్శన్‌లు మాట్లాడుతూ ఈ లేబర్‌కోడ్లను ప్రతిపాదన పెట్టినప్పుడే దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలన్ని వ్యతిరేకించాయని పేర్కొన్నారు. దీనితో కేంద్రం వెనక్కి తగ్గిందని, ఐదు సంవత్సరాలు అమలు చేయలేదని తెలిపారు. ఇటీవల బీహార్ ఎన్నికలు జరిగిన వెంటనే ఈ కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చిందని, ఇంతకంటే దుర్మార్గం మరొకటి ఉండదని తెలిపారు. దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలన్ని ఒక్కతాటిపైకి రానున్నాయని తెలిపారు. కేంద్రంలోని మోడి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత బొగ్గు పరిశ్రమలను లేకుండా చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. త్వరలోనే సింగరేణిలో కోడ్లకు వ్యతిరేకంగా రోజువారీ ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. అనంతరం ఏరియాలోని కేకేఓసీ, ఏరియా స్టోర్, వర్కుషాపు, సివిల్ డిపార్టుమెంటుతోపాటు కాసిపేట, కాసిపేట2, శాంతిఖనిగనిలో కూడ నిరసన కార్యక్రమాలు చేపట్టి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక జేఏసీ నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, సోమిషెట్టి రాజేశం, బిక్షపతి, హనుమాండ్ల ప్రసాద్, వీరా రెడ్డి, తాళ్లపెల్లి సారయ్య, సంకె వెంకటేశ్, ఎగ్గడి రాజేశ్వర్‌రావు, ముల్కల్లపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానేరు వాగు చెక్ డ్యామ్ ఘటనపై

- సమగ్ర విచారణ చేపట్టాలి: మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 25: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కేంద్రంలోని తనుగుల గ్రామ శివారులోని మానేరు నదిపైన ఇటీవల కూలి పోయిన చెక్ డ్యాంను మాజీ మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్, తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ 24 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యామ్ ను ఇసుక మాఫియా చెందిన కొందరూ ఉద్దేశ్యపూర్వకంగా కూల్చివేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్ ల కూల్చి వేతలు పరిపాటి గా మారిందాన్నారు. గతంలో హుస్సేన్మియా వాగుపై, అదే విధంగా నిర్మల్ జిల్లా స్వర్ణ వాగుపై పెల్చివేశారని అన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 24 కోట్ల తో ఏర్పాటు చేసిన చెక్ డ్యామ్ ను రాత్రికి రాత్రే ఇసుక మాఫియా ముసుగులో పెల్చివేశారాన్నారు. రాష్టంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఒక చెక్ డ్యామ్ కూడా కట్టలేదని, బీఆర్ఎస్ పాలనలో 12వేల చెక్ డ్యాములు, 44వేల చెరువులు, కుంటలకు మరమ్మతు పనులు చేశామన్నారు. చెక్ డ్యామ్ కట్టిన రాఘవ కన్ స్ట్రెక్షన్ ను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వరి అవశేషాలను రైతులు ఎరువుగా మార్చుకోవాలి

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 25: రైతులు వరి పంట కోసిన తర్వాత మిగిలే వరి కొయ్యలను కాల్చడం అలవాటుగా మారిందని, అలా కాల్చే పద్ధతిని మార్చుకోవాలని వ్యవసాయ అధికారి వినోద్ అన్నారు.దాని వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, వరి కొయ్యలను కాల్చడం ద్వార కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, సూక్ష్మ ధూళి కణాలు , బూడిద, గాలిలో కలవడం ద్వారా భూసారం క్షీణిస్తుందని అన్నారు. దాంతో పాటు సూక్ష్మ జీవుల సంఖ్య తగ్గి తేమ శాతం ఆవిరై పంట దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఏ ఈ ఓ ఉమ మహేశ్వరి మాట్లాడుతూ రైతులు ఎస్ఎస్‌పీ పద్ధతిని వాడి మిగిలిన వరి కొయ్యల అవశేషాలను కుళ్లింపచేయాలని అన్నారు. కుళ్ళిన వరి కొయ్యలు ఎరువుగా మారి, పోషకాలు పాస్ఫరస్, సల్ఫర్ లను అందించి భూమిలో పంట ఉత్పాదకతను పెంచుతుందని తెలిపారు. రైతులు డి కంపోజ్ చేయడం ద్వారా భూమిలో పగుళ్లు రాకుండా, తేమ శాతాన్ని పెంచి అధిక దిగుబడినిస్తుందని అన్నారు. ఇందులో రైతులు కాంతయ్య, దేవేందర్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో మహిళా అభ్యుదయం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధికి చెందుతున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతి రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ మండలం పాల్దా, మోపాల్ మండలం న్యాల్కల్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, నిజామాబాద్ రూరల్ మండలం గుండారం గ్రామంలో మహిళా సంఘాలకు సంబంధించి రూ. 6కోట్ల 80 లక్షల రుణమాఫీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డక మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని, మహిళలు చిరు వ్యాపారాలకే పరిమితం కాకుండ పెద్ద పెద్ద వ్యాపారాలు చేసుకునేందుకు చేయూత అందిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని భూపతిరెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉచిత విద్యుత్తును అందిస్తున్నామని ప్రతి ఒక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, అడిగిన వారందరికీ రేషన్ కార్డులను సైతం మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మోపాల్ ఎమ్మార్వో, ఎం పి డీ ఓ, నాయకులు శ్రీధర్, సర్పంచులు ప్రసాద్, జనార్ధన్, ఒడ్డెన్న సతీష్ గంగా ప్రసాద్, అగ్గూ భోజన్న, కోర్వా గంగాధర్, కిరణ్ రావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ నిలిచేలా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలి. ఫ్యూచర్ సిటీలో చేపట్టే ప్రతి అంశాన్ని హైలైట్ చేయాలి. పెట్టుబడిదారులకు సిటీలోని అనుకూలాంశాలు, రాష్ట్ర కళా, సాంస్కృతిక, భాష, వాతావరణ అనుకూలతను వివరించాలి. ప్రముఖులకు బ్రాండింగ్‌లో చోటు కల్పించాలి.

- గ్లోబల్ సమ్మిట్ సమీక్షలో సీఎం రేవంత్

ప్రొటోకాల్ పాటించని కలెక్టర్ పై చర్యలు తీసుకోవాలి

- చీఫ్ సెక్రెటరీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ లీడర్ మల్లికార్జున్



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 25: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పట్ల ప్రొటోకాల్ పాటించని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ లీడర్ పిమల్లికార్జున్ చీఫ్ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఫిర్యాదు పత్రాన్ని సీఎస్ కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎంపీగా ఎన్నికైన గడ్డం వంశీకృష్ణ పట్ల కలెక్టర్ చిన్నచూపు చూస్తూ అవమానిస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. గతంలో ప్రొటోకాల్ పాటించని పక్షంలో ఉన్నతాధికారుల హెచ్చరికలతో కలెక్టర్ ఎంపీ వంశీకృష్ణకు క్షమాపణలు చెపుతూ బహిరంగ ప్రకటన చేశారని, కానీ మళ్లీ పాత పద్ధతి లోనే వ్యవహరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఈఎస్ఐ హాస్పిటల్ స్థల పరిశీలనకు వస్తున్నామని అధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చినా, కనీస ఏర్పాట్లు కూడా చేయక పోవడం ఆయనను అవమానించే విధంగా వారి వ్యవహారం ఉందన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి ప్రాంతాలలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో కూడా ప్రొటోకాల్ పాటించకుండా ఎంపీని ఆహ్వానించలేదని, ఇది క్షమించరానిదన్నారు. ఒకసారి తప్పు చేసి క్షమాపణలు చెప్పిన కలెక్టర్ పదేపదే అదే తప్పు చేస్తున్నారని, అలాంటి కలెక్టర్ పై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని మల్లికార్జున్ సీఎస్ కు పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 25 : సారంగాపూర్ మండలం లోని తాండ్ర (జి) లో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సారంగాపూర్ మండల సోషల్ మీడియ కో ఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్ గారు, ఈ సందర్భంగా సాక్ పెల్లి సురేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తరపున సారీ పెట్టి గౌరవించాలని ఉద్దేశంతో కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు, స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీర ఇస్తున్నామని తెలియజేశారు.మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ, వారి పేరు మీదనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రతి మహిళ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తితో ఉక్కు మహిళగా ఎదగాలని కోరారు. ఇందిరమ్మ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తోందని, మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకొనేలా ప్రోత్సహించామన్నారు. ఆర్టీసీలో వెయ్యి బస్సులను మహిళలకు యజమానులను చేశామన్నారు, వడ్డీలేని రుణాలు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ పంప్ ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ లాంటి కార్యక్రమాలను మహిళా సంఘాలకే అప్పగించామన్నారు.మహిళ సంఘాల మాదిరిగానే 15 నుండి 18 ఏళ్ల కిశోర బాలికల కోసం అదేవిధంగా 60 ఏళ్ల పైబడ్డ వారికోసం ప్రత్యేకంగా సంఘాలు ఏర్పాటు చేసి, వారిని ఆదుకునే ఆలోచన ప్రభుత్వం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బూసది ఉమ ఐకేపీ సుజాత తాండ్ర. జి గ్రామ వెలుగు సంఘల అధ్యక్షురాళ్లు సాక్ పెల్లి లక్ష్మి, పాలేపు సాయవ్వ, క్యాతం సునీత, సాకాలి మాదిగి లక్ష్మి, వడ్ల సుగుణ, తోకలసంధ్య, కత్తెర పాక లవణ్య, కొడిమల దశ లక్ష్మి, తోకల వర లక్ష్మి, ఇంతియజ్, ముంతాజ్, చోటిమ వివిధ గ్రామ సంఘల సభ్యులు పాల్గొన్నారు.

నన్ను కదిలిస్తే మీ పునాదులు కదిలిస్తా

- బీజేపీ పార్టీకి మమత వార్నింగ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 25: తనతో రాజకీయంగా పోరాడే దమ్ము బీజేపీకి లేదని, తనను ఓడించడం ఆ పార్టీకి సాధ్యంకాదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్‌లో తనకు సవాల్ విసరాలని చూస్తే దేశవ్యాప్తంగా ఆ పార్టీ పునాదులను కదిలిస్తానని హెచ్చరించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' కు వ్యతిరేకంగా బన్‌గావ్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆమె ప్రసంగించారు. ఎన్నికల సంఘం ఏ మాత్రం నిష్పాక్షికంగా పనిచేయడం లేదని, అది బీజేపీ కమిషన్‌గా మారిందని మమత ఆరోపించారు. ఎస్ఐఆర్ కారణంగానే బీహార్ ఎన్నికల ఫలితాలు ఆ విధంగా వచ్చాయని, అక్కడ బీజేపీ ఆటను ప్రతిపక్షాలు అంచనా వేయలేకపోయాయని అన్నారు. ఒకవేళ అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమైతే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. అంటే.. 'డబుల్ ఇంజిన్' సర్కారు రాష్ట్రాల్లో చొరబాటుదారులు ఉన్నట్లు ఆ పార్టీ అంగీకరిస్తోందా? అని ప్రశ్నించారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా బయటకు వచ్చినప్పుడు ఈసీ, బీజేపీ సృష్టించిన గందరగోళాన్ని ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను రెండుమూడేళ్లపాటు నిర్వహిస్తే సహకరిస్తామని చెప్పారు. బీజేపీ తనను ఇరుకున పెట్టలేదని, తనతో ఆటలాడొద్దని హెచ్చరించారు.

విశ్వ వీక్షణం

హసీనాకు ఉరి చట్ట విరుద్ధం..

- ఆందోళనకు దిగిన అవామీ లీగ్

ఢాకా, నవంబర్ 25: మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఉరిశిక్ష విధించడంపై ఆమె మద్దతుదారులు భగ్గుమంటున్నారు. తమ పార్టీ అధినేత్రికి నవంబర్ 17న విధించిన మరణ శిక్ష చట్ట విరుద్ధమని మండిపడుతున్నారు. బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు యూనుస్‌ను హంతకుడితో పోలుస్తున్న బంగ్లాదేశ్ అవామీ లీగ్ మంగళవారం దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చింది. అంతేకాదు ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు అవామీ లీగ్ నేతలు. నిరుడు ఆగస్టులో నిరసనకారులను అణచివేసేందుకు హేక్ హసీనా క్రూరంగా వ్యవహరించారని, మానవత్వాన్ని ఆందోళనకారులను చంపేయాలని ఆదేశాలు ఇచ్చారని ఇటీవల అంతర్జాతీయ నేర విచారణ కోర్టు పేర్కొంది. మృతికి కారణమైన ఆమెకు మరణశిక్ష విధిస్తూ నవంబర్ 17న తీర్పునిచ్చింది. హసీనాకు ఉరి శిక్ష వేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆమెకు ఉరి చట్టవిరుద్ధమంటూ మద్దతుగా బంగ్లాదేశ్ అవామీ లీగ్ నిరసనలు తెలిపింది. మాజీ ప్రధానికి ఉరిని ఖండించిన అవామీ లీగ్ నవంబర్ 25 నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చింది. నవంబర్ 30 వరకూ హసీనాకు సంఘీభావంగా ర్యాలీలు, నిరసనలు చేపట్టాలని నిర్ణయించింది. అంతేకాదు యూనస్‌ను దోపిడిదారుగా పేర్కొన్న అవామీ నేతలు.. ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 'అక్రమంగా అధికారంలోకి వచ్చిన యూనస్ వెంటనే రాజీనామా చేయాలి. అంతర్జాతీయ నేర విచారణ కోర్టు హసీనాకు విధించి ఉరి శిక్షను తిరస్కరిస్తున్నాం. ప్రజలారా యూనస్ ప్రోద్బలంతో హసీనాకు చట్టవిరుద్ధంగా కోర్టు మరణశిక్ష విధించడం మీరంతా చూశారు. కాబట్టి.. మీరంతా ఆమె మరణ శిక్షను ఖండిస్తూ ఎక్కడ వీలైతే అక్కడ ఆందోళనలు నిర్వహించండి' అని అవామీ లీగ్ తమ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చింది.



మంచు కురిసే వేళలో..

శీతాకాలపు అందాలు, మంచులో క్రీడలు, కొత్త అనుభూతిని పంచే విహారయాత్రలు, అద్భుతమైన మంచు ప్రకృతి దృశ్యాలను అందించే గమ్యస్థానాలు భారత్ లో చాలానే ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఈ సీజన్ లో చూడాల్సిన ఇలాంటి అందమైన ప్రదేశాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



మంచుతో కప్పబడిన పర్వతాలు, ఆహ్లాదకరమైన హిల్ స్టేషన్లు, ప్రశాంతమైన లోయలను అన్వేషించడానికి శీతాకాలం అద్భుతమైన సీజన్. మీరు మంచు అందాలను ఆస్వాదించగల ప్రాంతాలను చూడాలనుకుంటే మీకు ఫిబ్రవరి నెలలో కొన్ని ప్రాంతాలు అద్భుతమైన సరికొత్త అనుభూతిని పంచుతాయి. శీతాకాలపు క్రీడలు, చలి మంటల వేడి, అద్భుతమైన శీతాకాలపు దృశ్యాలలో చూడాలనుకునే వారికోసం ఇక్కడ కొన్ని అద్భుతమైన ప్రాంతాలు ఉన్నాయి. ఆ వివరాలు మీకోసం !

మనాలి

హిమాచల్ ప్రదేశ్

మనాలి భారతదేశంలోని శీతాకాలపు చాలా మందికి ఇష్టమైన ప్రదేశం, దాని అందమైన మంచుతో కప్పబడిన పర్వతాలు, శక్తివంతమైన స్థానిక సంస్కృతి, అనేక రకాల కార్యకలాపాలతో సందర్శకులను ఆకర్షిస్తుంది. పట్టణంతో పాటు దాని పరిసరాలు మంచుతో కప్పబడిన దుప్పటితో చుట్టబడి ఉన్నందున ఫిబ్రవరి వెళ్ళడానికి గొప్ప సమయం. మీరు సోలాంగ్ వ్యాలీలో స్కీయింగ్ చేయవచ్చు, పారాగ్లైడింగ్ ప్రయత్నించవచ్చు లేదా బియాస్ నదిలో అద్భుతమైన అనుభూతిని పొందవచ్చు.

లేహ్ -లడఖ్

జమ్మూ & కాశ్మీర్

లేహ్‌లడఖ్ శీతాకాలంలో సందర్శించడానికి అత్యంత శీతలమైన, అత్యంత ఉత్కంఠభరితమైన ప్రదేశాలలో ఒకటి. ఫిబ్రవరిలో ఈ ప్రాంతం లోతైన మంచుతో కప్పబడి, అద్భుతమైన శీతాకాలపు అద్భుతాన్ని సృష్టిస్తుంది. ఈ సమయంలో కొన్ని ప్రాంతాలు మూతపడినప్పటికీ ఇప్పటికీ ఘనీభవించిన పాంగోంగ్ సరస్సును సందర్శించవచ్చు, స్థానిక మఠాల దృశ్యాలు చూడవచ్చు. చల్లని ఎడారి, మంచు కలయిక నిజంగా అద్భుతమైన దృశ్యాలు కనులవిందు చేస్తాయి.

సిమ్లా

హిమాచల్ ప్రదేశ్

హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లా చలికాలంలో అద్భుతమైన ప్రకృతి దృశ్యాలకు సాక్షిగా నిలుస్తుంది. ఈ నగరం శీతాకాలపు అందంతో వలసల శోభను మిళితం చేస్తుంది. ఫిబ్రవరిలో, సిమ్లాలో తేలికపాటి హిమపాతం కనిపిస్తుంది. రిడ్జ్ రోడ్‌ను షికారు చేయడానికి లేదా వేడి చాయ్ తాగడానికి ఒక సుందరమైన ప్రదేశంగా మార్చింది. మీరు స్కీయింగ్, టోబోగానింగ్‌కు ప్రసిద్ధి చెందిన కుఫ్రి, నరకంద వంటి సమీపంలోని ప్రదేశాలను కూడా సందర్శించవచ్చు. ఇక్కడ చారిత్రక భవనాలు, మంచుతో కప్పబడిన కొండలు, సమీపంలోని స్కీయింగ్ ప్రదేశాలు చూడటం కోసం మీరు ఇక్కడకు వెళ్లవచ్చు.

ఔలి

ఉత్తరాఖండ్

ఔలి ఉత్తరాఖండ్‌లో అద్భుతమైన.. అందమైన ప్రకృతి నిధి. దాని తాకని మంచు, నందా దేవి, హిమాలయ శిఖరాల అద్భుతమైన దృశ్యాలు మీకు కనులవిందు చేస్తాయి. భారతదేశంలోని ప్రీమియర్ స్కీ రిసార్ట్‌లలో ఒకటిగా, ఫిబ్రవరి ఇక్కడ స్కీయింగ్, స్నోబోర్డింగ్ కోసం అనువైన సమయం. అద్భుతమైన మంచుతో కప్పబడిన పర్వతాలు, సుందరమైన కేబుల్ కార్ రైడ్‌లు ఔలిని శీతాకాలంలో సందర్శించాల్సిన గొప్ప ప్రదేశాల్లో ఒకటిగా చేశాయి.

నైనిటాల్

ఉత్తరాఖండ్

భారతదేశంలోని "లేక్ డిస్ట్రిక్ట్" అని పిలువబడే నైనిటాల్ శీతాకాలంలో చాలా అందంగా ఉంటుంది. సరస్సులు, వలస జీవుల ఆకర్షణకు ప్రసిద్ధి చెందిన ఈ పట్టణం ఫిబ్రవరిలో మంచు దుప్పటి కప్పుకుని అందరినీ మంత్రముగ్ధులను చేస్తుంది. నైని సరస్సులో రొమాంటిక్ రైడ్‌ను ఆస్వాదించవచ్చు. మాల్ రోడ్‌లో షికారు చేయడం, మంచుతో కప్పబడిన శిఖరాల అద్భుతమైన దృశ్యాలు, స్నో వ్యూ పాయింట్ మీకో సరికొత్త అనుభూతిని పంచుతాయి.

మున్సియరి

ఉత్తరాఖండ్

ప్రశాంతమైన, ప్రత్యేకమైన గమ్యస్థానం కోసం వెతుకుతున్న వారికి, మున్సియరి ఒక అద్భుతమైన శీతాకాలపు ప్రదేశం. కుమావోన్ ప్రాంతంలో ఉన్న ఇది మంచుతో కప్పబడిన పర్వతాలు, సహజమైన అందాల మధ్య ప్రశాంతంగా ఉంటుంది. ఫిబ్రవరిలో ఈ ప్రాంతం సందర్శనకు అనువైనది. ఈ ప్రాంతం మంచుతో కప్పబడి ఉంటుంది, ప్రశాంతమైన ట్రెక్కింగ్, అద్భుతమైన పంచచూలి శిఖరాల చుట్టూ ప్రకృతి నడకలు జీవితంలో మరిచిపోలేని అనుభూతిని పంచుతాయి.

గుల్మార్గ్

జమ్మూ & కాశ్మీర్

పువ్వుల పచ్చికభూమిగా గుర్తింపు పొందిన గుల్మార్గ్ శీతాకాలంలో మరీ ముఖ్యంగా ఫిబ్రవరిలో భూవిపై ఉన్న స్వర్గంగా మారుతుంది. పిర్ పంజాల్ పర్వత శ్రేణి మృదువైన, పొడి మంచు, ఉత్కంఠభరితమైన చూపుతిప్పకోనివ్వని దృశ్యాలు కొత్త అనుభూతిని పంచుతాయి. మీరు స్కీయింగ్ చేయడానికి ఆసక్తిగా ఉన్నా లేదా మంచులో ఆడాలనుకున్నా, గుల్‌మార్గ్ ప్రతిఒక్కరికీ అద్భుతమైన పర్యాటక ప్రాంతం. ఇక్కడ ప్రపంచంలోని అత్యంత ఎత్తైన కేబుల్ కార్లలో ఒకటైన గుల్‌మార్గ్ గొండోలా, మంచుతో కప్పబడిన లోయల అద్భుతమైన దృశ్యాలను చూపిస్తూ అఫర్వాట్ పర్వత శిఖరానికి మిమ్మల్ని తీసుకెళ్తుంది.

తవాంగ్

అరుణాచల్ ప్రదేశ్

ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్, మంచు ఔత్సాహికులకు ఆకర్షణీయమైన ప్రదేశం. ఫిబ్రవరిలో పట్టణం మంచుతో కప్పబడి ఉంటుంది. ఇది శీతాకాలపు మాయాజాలాన్ని అనుభవించడానికి అద్భుతమైన ప్రదేశం. తవాంగ్ దాని అందమైన మఠాలకు ప్రసిద్ధి చెందింది. ఆకట్టుకునే తవాంగ్ మొనాస్టరీ, చుట్టూ మంచుతో కప్పబడిన పర్వతాలు ఒక సుందరమైన నేపథ్యాన్ని సృష్టిస్తాయి. ఇక్కడి మంచు పర్వతాలు, అందమైన మఠాలు, ఒక ప్రత్యేకమైన సాహసం కోసం ఈ ప్రాంతం సందర్శించవచ్చు.

ఖర్గేతో డీకే శివకుమార్ కీలక భేటీ!

- సీఎం పదవిపై చర్చలంటూ ఊహాగానాలు?

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 25: కర్నాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతున్నది. సీఎం సిద్ధరామయ్య తర్వాత డీకే శివకుమార్ మంగళవారం బెంగళూరులో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సమావేశమయ్యారు. పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఢిల్లీకి బయలుదేరే ముందు ఈ సమావేశం జరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సమావేశం తర్వాత ఇద్దరూ ఒకే కారులో విమానాశ్రయానికి వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో సగం పూర్తయ్యింది. దాంతో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు తీవ్రమయ్యాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తర్వాత సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగాలని ఒప్పందం చేసుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. రాబోయే రెండున్నరేళ్ల పాటు డీకే శివకుమార్ సీఎం పదవి చేపడుతారా? అన్న చర్చలు సాగుతున్నాయి. సోమవారం ఖర్గేతో సమావేశం అనంతరం సిద్ధరామయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటుంది. ఏ నిర్ణయం తీసుకున్నా నేను దాన్ని అంగీకరించాలి. శివకుమార్ అలాగే చేయాలి' అని పేర్కొన్నారు. అయితే, శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధిష్టానం మంత్రివర్గ పునర్వ్యస్థీకరణకు కొద్ది నెలల కిందట అంగీకారం తెలిపింది. కానీ ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత మార్పు జరుగుతుందని తెలిపారు. హైకమాండ్ నిర్ణయించిందే చెల్లుబాటు అవుతుందన్నారు.



ఇజ్రాయెల్ ప్రధాని భారత పర్యటన రద్దు

- ఢిల్లీ పేలుళ్లే కారణమా.?

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 25: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత పర్యటన మళ్లీ రద్దయ్యింది. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన ఆత్మహుతి బాంబు పేలుళ్ల ఘటనే ఇందుకు కారణమని తెలుస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఆయన పర్యటన రద్దయినట్లు సమాచారం. ఈ ఏడాదిలో నెతన్యాహు భారత పర్యటన రద్దుకావడం ఇది మూడోసారి కావడం గమనార్హం. నెతన్యాహు చివరిసారిగా 2018లో భారత్‌కు వచ్చారు. ఆ తర్వాత ఈ ఏడాది పర్యటించాలనుకోగా పలు కారణాలతో రద్దవుతూనే ఉంది. సెప్టెంబర్ 9న ఆయన ఇండియాకు రావాల్సి ఉంది. అయితే అక్కడ బిజీ షెడ్యూల్ ఉండటంతో రాలేకపోయారు. తాజాగా డిసెంబర్ నెలలో ప్రధాని మోదీతో సమావేశం కావాల్సి ఉండగా ఢిల్లీలో భద్రతా కారణాల దృష్ట్యా మరోసారి రద్దైంది. ఇక ఈ ఏడాది ఆయన భారత్‌లో పర్యటించే అవకాశాలు లేనట్లే. 2026లో ఆయన పర్యటన ఉండేలా ప్రణాళికలు సాగుతున్నాయి. కానీ దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. భారత ప్రధాని మోదీ 2017లో ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2018 జనవరిలో నెతన్యాహు భారత్‌ను సందర్శించారు. దాంతో ఇరు దేశాల ప్రధానుల మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొన్నాయి.

సంపాదించడానికి అధికారంలోకి రాలేదు!

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 25: తాము నిజాయితీగా ప్రభుత్వాన్ని నడుపుతున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. పంజాబ్ లోని ఆనంద్‌పూర్ సాహిబ్‌లో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఇన్ని నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రజలు అడుగుతున్నారని, ప్రభుత్వ నిధులను పూర్తిగా ప్రజల కోసమే వినియోగిస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కానివ్వడంలేదని చెప్పారు. తాము గురు మహరాజ్ సాహిబ్ మార్గంలో నడుస్తున్నామని, తప్పుచేసి ఉంటే ఆయన తమను శిక్షిస్తారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చింది డబ్బు సంపాదించడం కోసం కాదని, మంచి పేరు సంపాదించడం కోసమని కేజ్రీవాల్ అన్నారు. తాము పెద్దపెద్ద బంగ్లాలు నిర్మించుకోవడం కోసం రాలేదని, గురు మహరాజ్ ఆశీర్వాదాల కోసం వచ్చామని తెలిపారు.





వన్డే సిరీస్ కు రెడీ... ముంబై చేరుకున్న విరాట్

భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మరోసారి మైదానంలోకి దిగనున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అర్ధ శతకంతో మెరిసిన విరాట్ ఈసారి స్వదేశంలో చెలరేగిపోయేందుకు సిద్ధమవుతున్నాడు. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ స్క్వాడ్‌లో ఒకడైన కోహ్లీ ముంబై చేరుకున్నాడు. ఆసీస్ పర్యటన తర్వాత లండన్‌లోనే ఉండిపోయిన అతడు మంగళవారం సొంతగడ్డకు తిరిగొచ్చాడు. నలుపు రంగు ప్యాంట్.. చాక్లెట్ కలర్ షర్ట్.. తలకు టోపీ.. కళ్లద్దాలు పెట్టుకొని సింపుల్ లుక్‌లో కనిపించిన రన్ మెషీన్ ఫ్యాన్స్‌తో సెల్ఫీలు దిగాడు. నిరుడు టీ20లకు.. ఈ ఏడాది జూన్‌లో టెస్టులకు వీడ్కోలు పలికిన కోహ్లీ వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. వచ్చే వన్డే వరల్డ్ కప్ ఆడాలనుకుంటున్న విరాట్ ఆస్ట్రేలియా పర్యటనలో రెండు మ్యాచుల్లో సున్నాకే ఔటైనా.. సిడ్నీ వన్డేలో అర్ధ శతకంతో రాణించాడు. ఇప్పుడు స్వదేశంలో దక్షిణాఫ్రికాపై బ్యాట్ ఝులిపించేందుకు ముంబై చేరుకున్నాడు కోహ్లీ. ప్రస్తుతం 50 ఓవర్ల ఆటలో 51 శతకాలు.. 75 హాఫ్ సెంచరీలు బాదిన అతడు.. సఫారీలపై చెలరేగితే మరిన్ని రికార్డులు బద్ధలవ్వడం ఖాయం. నవంబర్ 30న రాంచీ వేదికగా తొలి మ్యాచ్ జరుగనున్నందున.. కోహ్లీ త్వరలోనే స్క్వాడ్‌తో కలువనున్నాడు.

భారత్ లక్ష్యం 549 పరుగులు

దక్షిణాఫ్రికాతో గువహటి వేదికగా జరుగుతున్న రెండో టెస్టులోనూ భారత జట్టు ఓటమి దిశగా పయనిస్తున్నది. మెన్ ఇన్ బ్లూ ఎదుట సఫారీలు 549 పరుగుల కొండంత లక్ష్యాన్ని నిలుపగా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఓపెనర్లిద్దరి వికెట్లను కోల్పోయిన భారత్ 27/2తో కష్టాల్లో పడింది. ఐదో రోజు భారత విజయానికి 522 పరుగులు కావాల్సి ఉండగా ఉపఖండంపై చరిత్ర సృష్టించేందుకు సఫారీలకు 8 వికెట్లు తీస్తే సరిపోతుంది. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌ను దక్షిణాఫ్రికా 260/5 వద్ద డిక్లేర్డ్ చేసింది. తొలి ఇన్నింగ్స్ (288) ఆధిక్యంతో కలిపి ఆతిథ్య జట్టు ఎదుట రికార్డు లక్ష్యాన్ని నిలుపగలిగింది. ట్రిస్టన్ స్టబ్స్ (180 బంతుల్లో 94, 9 ఫోర్లు, 1 సిక్స్) తృటిలో శతకాన్ని కోల్పోగా టోని డి జోర్జి (49)అతడికి అండగా నిలిచాడు. మూడో రోజుకే 300కు పైచిలుకు ఆధిక్యం కల్గిన దక్షిణాఫ్రికా.. నాలుగో రోజు ఉదయం సెషన్‌లో వేగంగా ఆడేందుకు యత్నించినా 17 పరుగుల వ్యవధిలో మూడు కీలక వికెట్లు కోల్పోయింది. సీనియర్ స్పిన్నర్ జడేజా (4/62).. తొలి గంట ఆటలో రికెల్టన్ (35) ను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచాడు. డ్రింక్స్ తర్వాత మార్క్మ్ (29), బవుమా (3) సైతం నిష్క్రమించడంతో సఫారీల ఆటలు సాగవనే అనుకున్నారంతా! కానీ స్టబ్స్ మాత్రం భారత్‌కు షాకిచ్చాడు. తన శైలికి పూర్తి భిన్నంగా ఆడిన అతడు.. డిఫెన్స్‌కే ప్రాధాన్యమిస్తూ దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని క్రమంగా పెంచాడు. జోర్జితో కలిసి నాలుగో వికెట్‌కు 101 రన్స్ జోడించిన అతడు.. ఆ తర్వాత మల్డర్ (35)తోనూ 82 పరుగులు జతచేశాడు. రికార్డు ఛేదనలో టీమ్‌ఇండియా 21 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. జైస్వాల్ (13).. మరోసారి యాన్సెన్ బౌలింగ్‌లో కీపర్ వెరేన్‌కు క్యాచ్ ఇచ్చాడు. రెండు ఓవర్ల తర్వాత బంతినందుకున్న హర్మర్.. మరో ఓపెనర్ రాహుల్ (6)ను క్లీన్‌బౌల్డ్ చేసి దక్షిణాఫ్రికా శిబిరంలో సంతోషాన్ని రెట్టింపు చేశాడు.

టీ 20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదల

వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్‌నకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు ఐసీసీ మంగళవారం ముంబైలో షెడ్యూల్‌ను ప్రకటించింది. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకూ జరుగబోయే ఈ మెగా టోర్నీకి భారత్‌లో ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, ముంబై ఆతిథ్యమివ్వనుండగా శ్రీలంకలో కొలంబో, క్యాండీలో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. 20 జట్లు తలపడబోయే ఈ టోర్నీలో జట్లను 4 గ్రూపులుగా విభజించారు. రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించబోయే ఈ టోర్నీలో గ్రూప్, నాకౌట్‌తో కలిపి 55 మ్యాచ్‌లు జరుగుతాయి. గ్రూప్ దశలో టాప్2లో నిలిచిన జట్లు సూపర్8 స్టేజ్‌కు అర్హత సాధిస్తాయి. ఈ దశలో 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. వాటిలో టాప్2లో నిలిచిన జట్లు సెమీస్‌కు వెళ్తాయి. కాగా షెడ్యూల్ విడుదల సందర్భంగా భారత మాజీ సారథి రోహిత్ శర్మను ఐసీసీ.. ఈ టోర్నీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఫిబ్రవరి 7న కొలంబోలో పాకిస్థాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌తో టోర్నీ ఆరంభం కానుంది. గ్రూప్ దశ ఫిబ్రవరి 20దాకా సాగనుంది. 20నుంచి మార్చి 01 వరకూ సూపర్8 దశ జరుగనుండగా 4వ తేదీ నుంచి నాకౌట్ స్టేజ్ మొదలవుతుంది. తొలి సెమీస్ కోల్‌కతా (పాకిస్థాన్ క్వాలిఫై అయితే కొలంబోలో), రెండో సెమీస్ ముంబైలో జరుగుతుంది. మార్చి 8న అహ్మదాబాద్ (పాక్ అర్హత సాధిస్తే కొలంబోలో) ఫైనల్‌కు ఆతిథ్యమివ్వనుంది. ఆతిథ్య హక్కులు కల్గిన భారత జట్టు.. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఫిబ్రవరి 7న టైటిల్ వేటను ప్రారంభించనుంది. గ్రూప్‌ఏలో ఉన్న టీమ్‌ఇండియా..తమ గ్రూపులోనే ఉన్న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఫిబ్రవరి 15న అమీతుమీ తేల్చుకోనుంది. దాయాదుల పోరు కొలంబోలో జరుగనుంది. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లన్నీ కొలంబోలోనే జరుగుతాయి.

గ్రూపులు:

గ్రూప్ ఏ: భారత్, పాకిస్థాన్, నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ
గ్రూప్ బీ: శ్రీలంక, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జింబాబ్వే, ఒమన్
గ్రూప్ సీ: ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్, ఇటలీ
గ్రూప్ డీ: దక్షిణాఫ్రికా, అఫ్ఘనిస్థాన్, న్యూజిలాండ్, కెనడా, యూఏఈ

బెల్జియం చేతిలో హాకీ ఇండియా ఓటమి

ప్రతిష్టాత్మక సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు తొలి పరాభవం ఎదురైంది. బెల్జియం 32తో భారత్‌ను ఓడించింది. వర్షం కారణంగా సోమవారం జరగాల్సిన మ్యాచ్ మంగళవారానికి రీషెడ్యూల్ చేయగా భారత జట్టు పోరాడి ఓడింది. అభిషేక్ (33వ నిమిషంలో), షీలానంద్ (57వ ని.) తలా ఒక గోల్ చేయగా బెల్జియం నుంచి రొమన్ (17, 57వ ని.) , నికోలస్ (45వ ని.) గోల్స్ సాధించారు. ఈ టోర్నీలో భారత్.. తమ తదుపరి మ్యాచ్‌ను బుధవారం మలేషియాతో ఆడనుంది.

'ఆంధ్ర కింగ్ తాలూకా' అద్భుతమైన ఎమోషన్ ఉన్న సినిమా

కన్నడ స్టార్ ఉపేంద్ర

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో అలరించబోతున్నారు. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆన్‌స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్ & మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది. నాలుగు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా మారాయి. ట్రైలర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సినిమాపై అంచనాలని భారీగా పెంచింది. ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది. ఈ సందర్భంగా కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఈ కథ విన్నప్పుడు మీ రియాక్షన్ ఏమిటి?

కథని ఒక ప్రేక్షకుడిగా విన్నాను. స్టోరీ చెప్పగానే ఫ్యాన్స్‌కి కనెక్ట్ అయిపోయాను. ఇందులో చాలా అద్భుతమైన ఎమోషన్ ఉంది. అందరి జీవితంలో ఇలాంటి ఎమోషన్ వుంటుంది. అది నాకు ఎమోషనల్ గా చాలా కనెక్ట్ అయ్యింది. అసలు అభిమానులు ప్రేమకు లాజిక్ వుండదు. ఎందుకు ఇంతగా ప్రేమిస్తారు? దానికి మనం అర్హులమేనా? అనిపిపిస్తుంటుంది కదా. అందుకు నేను బాగా కనెక్ట్ అయ్యాను.

ఫాన్స్ తో మీకు మెమోరియల్ గా ఉండే మూమెంట్స్ ఏమైనా ఉన్నాయా?

చాలా ఉన్నాయి. నేను నా బర్త్ డే(సెప్టెంబర్ 18)ని ఫ్యాన్స్ డే గా అనౌన్స్ చేశాను. ఆ రోజంతా వాళ్లదే. ఎంతో మంది ఫ్యాన్స్ వచ్చి లక్షల్లో ఖర్చు పెట్టి పెద్ద వేడుకల చేస్తారు. పెద్ద కటౌట్లు పెడతారు. సింహాసనం మీద కూర్చో పెడతారు. పూలతో అభిషేకం చేస్తారు. నేను ఎంత వద్దని చెబుతున్నా.. ఈరోజు మాదే అంటారు. వాళ్ళ అభిమానానికి అవధులు లేవు.

సూపర్ స్టార్ సూర్య క్యారెక్టర్ ఎలా ఉండబోతోంది?

ఒక స్టార్ జీవితం ఎలా ఉంటుందో అలానే ఉంటుంది. ఫ్యాన్స్ క్రేజ్, అప్ అండ్ డౌన్స్ అన్నీ ఉంటాయి. హ్యూమన్ ఎమోషన్స్, ప్రేమ, రిచ్ పూర్ కి మధ్య ఉండే ఒక సంఘర్షణ ఎలివేషన్స్ అన్నికమర్షియల్ యాంగిల్ లో చేసిన సినిమా ఇది. అవన్నీ సినిమాకి అద్భుతంగా కలిసి వచ్చాయి. ఒక స్టార్ కి అభిమానికి మధ్య ఉండే ఎమోషన్‌ని చాలా అద్భుతంగా చెప్పారు. అది చాలా కొత్తగా అనిపిస్తుంది. ఇలాంటి మంచి సినిమా చేసినందుకు మైత్రి మూవీ మేకర్స్ కి థాంక్యూ చెప్పాలి. ఈ సినిమాలో నేను భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. ఫ్యాన్స్‌కి ఏదైనా చెప్పాలని ఒక కోరుకుంటుంది. అది ఈ సినిమాతో దొరికినందుకు చాలా సంతోషంగా ఉంది.

మీ ఫస్ట్ డే ఫస్ట్ షో ఎక్స్ పీరియన్స్ గురించి?

నేను చేసిన 'A'సినిమా డే ఫస్ట్ థియేటర్ కి వెళ్ళా, అయితే ఆడియన్స్ అందరూ సినిమా చూడకుండా నా కోసం బయటికి వచ్చేశారు. అసలు అది డిఫరెంట్ స్క్రీన్ ప్లే వున్న సినిమా. ఆడియన్స్ సినిమా మిస్ అవుతారనే ఫీలింగ్ కలిగింది. అప్పటినుంచి థియేటర్ కి వెళ్ళడం ఆపేశాను. చిన్నప్పుడు సినిమా చూడటం పెద్ద విషయం. అదొక గ్రేట్ ఎక్స్ పీరియన్స్. ఏడాదికి ఒకసారి వెళ్ళడమే గొప్ప. నేను సినిమాల్లోకి వచ్చిన తర్వాత రజనీకాంత్ గారు, చిరంజీవి గారి సినిమాలను ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేవాడిని. నాగార్జున గారి శివ సినిమా కూడా ఫస్ట్ డే ఫస్ట్ షో చూశాను.

రామ్ తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

రామ్ ఎనర్జిటిక్ పెర్ఫార్మర్. ఇంటర్వెల్ సీక్వెన్స్ లో

ఆయన యాక్షన్ చూస్తే గూస్ బంప్స్ వస్తాయి. ఆ సీన్ మీరు చూసినప్పుడే మీరే చెప్తారు. ఆయన రియల్ గా ఒక ఫ్యాన్ లాగా నటించారు. ఒక స్టార్ అయి ఉండి అలా నటించడం అంత ఈజీ కాదు. ఒక అభిమానిలో ఉండే అమాయకత్వం ఎనర్జీ మాస్ అన్ని అద్భుతంగా కనిపించాయి. ఒక స్టార్ కి అభిమానికి మధ్య ఉండే కనెక్షన్ డివైన్. అలాంటి ఒక ఎమోషన్ ని ఆయన పండించిన విధానం అద్భుతం .

భాగ్యశ్రీ తో మీకు కాంబినేషన్ సీన్స్ ఉన్నాయా?

ఉన్నాయి. ఇందులో రామ్ భాగ్యశ్రీ మధ్య కెమిస్ట్రీ చాలా అద్భుతంగా వర్క్ అయింది. ఒక రెట్రో ఫీలింగ్ ని కలిగించే ఆ లవ్ స్టోరీ హార్ట్ టచ్చింగ్ గా ఉంటుంది. నేటివిటీని అద్భుతంగా తీసుకువచ్చారు.డైరెక్టర్ గారికి హ్యాట్సాఫ్ చెప్పాలి.చిన్న చిన్న డీటెయిల్స్ మీద చాలా చక్కని వర్క్ చేశారు.

సినిమా పాటలు కూడా చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది కదా?

నాలుగు పాటలు జనాల్లోకి అద్భుతంగా వెళ్ళాయి. ఇందులో ఒక బ్యాగ్రౌండ్ సాంగ్ వస్తుంది. అది కూడా మంచి బీట్ లో చేశారు. కొన్ని సినిమాలకి అన్ని చక్కగా కుదురుతాయి. ఈ సినిమా కూడా మంచి మ్యూజిక్, ఫోటోగ్రఫీ, మంచి ఆర్టిస్టులు, మంచి ప్రొడక్షన్ హౌస్ అందరు కూడా కలిసికట్టుగా మంచి వర్క్ ఇచ్చారు.

మీ డైరెక్షన్లో చిరంజీవి తో సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నారు కదా ?

అవునండి. అదొక పెద్ద డ్రీమ్. అన్ని కుదిరితే డెఫినెట్ గా చేస్తాను.

మీ డైరెక్షన్లో కొత్త సినిమా ఎప్పుడు ఉంటుంది?

కొన్ని కథల మీద వర్క్ జరుగుతుంది. మంచిది ఫైనల్ అయితే అనౌన్స్ చేస్తాను

కూలీలో రజినీకాంత్ తో కలిసి నటించడం ఎలా అనిపించింది?

నా జీవితంలో ఒక ఎక్స్ట్రార్డినరీ మూమెంట్ అది. రజినీకాంత్ గారికి నేనొక భక్తుడిని. నేను ఆయన్ని ఒక డిక్షనరీ లాగా ఫాలో అవుతాను. ఆయన అంటే నాకు అంత కనెక్షన్.

ఒక డైరెక్టర్, యాక్టర్ గా మీరు ఇంకా చేయదలుచుకున్న డ్రీమ్ క్యారెక్టర్స్, కథలు ఉన్నాయా?

ఆ ఆకలి ఎప్పుడూ ఉంటుంది. ఇంకా ఏదో కొత్తగా చేయాలి, మంచి కథ చెప్పాలి అనే తపన ఎప్పుడూ ఉంటుంది.

అవతార్: ఫైర్ అండ్ యాష్'

ఇండియాలో దుమ్ములేపే క్రేజ్

బుక్‌మైషోలో 12 లక్షలకు పైగా ఆసక్తి

సినిమా అభిమానులను ఏకకాలంలో మైమరపించిన జేమ్స్ క్యామెరన్ 'అవతార్' సిరీస్ మరోసారి భారీ హంగామా సృష్టించడానికి సిద్ధమవుతోంది. డిసెంబర్‌లో విడుదల కానున్న మూడో భాగం అవతార్: ఫైర్ అండ్ యాష్ కి భారత మార్కెట్‌లో ఊహించని స్థాయిలో క్రేజ్ పెరుగుతోంది. రీసెంట్ గా బుక్‌మైషో విడుదల చేసిన డేటా ప్రకారం, 12 లక్షలకుపైగా ఇండియన్ లవర్స్ ఈ సినిమాపై తమ ఆసక్తిని చూపారు. అడ్వాన్స్ ఇంటరెస్ట్‌లో ఇంత భారీ నెంబర్లు సాధించడం పెద్ద సినిమాలకే సాధ్యం, అవతార్ మాత్రం ముందే బెంచ్‌మార్క్ సృష్టించింది. భారత ప్రేక్షకులు మొదటి రెండు భాగాల్లో చూసిన భావోద్వేగం, విజువల్స్ ఈసారి కూడా మరింతగా ఉండబోతున్నాయన్న అంచనాలు ఉన్నాయి. జేక్ సల్లి (సామ్ వర్తింగ్టన్), నెయ్టిరి (జోయ్ సాల్డానా) మళ్లీ పాండోరా ప్రపంచంలోకి తీసుకెళ్లబోతుండగా, ఈసారి కథలో కీలకంగా నిలిచేది కొత్త తెగ "అష్ పీపుల్". వారి నాయకురాలిగా ఊనా చాప్లిన్ కనిపించబోతున్నారు. ఆమె పాత్ర వరాంగ్ పై ఇప్పటికే హాలీవుడ్‌లో కూడా హైప్ పెరిగింది. డిసెంబర్ 19 రిలీజ్ ఈ చిత్రం ఆరు భాషల్లో గ్రాండ్ గా విడుదల కానుంది.

'చతా పచా - రింగ్ ఆఫ్ రౌడీస్'

తెలుగురాష్ట్రాల్లో గ్రాండ్ రిలీజ్

మలయాళ సినిమాలో మొట్టమొదటి పూర్తి నిడివి గల WWEజానర్ యాక్షన్‌కామెడీ చిత్రం "చతా పచా - రింగ్ ఆఫ్ రౌడీస్" ను ప్రముఖ తెలుగు నిర్మాణపంపిణీ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా రిలీజ్ చేయనుంది. జనవరి 2026లో విడుదల కానున్న ఈ చిత్రం కేరళలో దుల్కర్ సల్మాన్ నేతృత్వంలోని వేఫేరర్ ఫిల్మ్స్ రిలీజ్ చేయనుంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు అద్వైత్ నాయర్ దర్శకత్వం వహించగా, రీల్ వరల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది. ఈ నిర్మాణ సంస్థను ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లెన్స్‌మన్ గ్రూప్ కలిసి ఏర్పాటు చేశాయి. రమేష్, రితేష్ రామకృష్ణన్, షిహాన్ షౌక్కత్, ఎస్. జార్జ్ మరియు సునీల్ సింగ్‌లు ఈ వెంచర్‌లో కీలక భాగస్వాములు. అర్జున్ అశోకన్, రోషన్ మాథ్యూ, ఇషాన్ షౌక్కత్ ("మార్కో" ఫేమ్), విశాఖ్ నాయర్, పూజా మోహన్‌దాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. WWE రెజ్లింగ్, ప్రపంచవ్యాప్తంగా ఆరాధించే పాత్రల నుండి ప్రేరణ పొందిన ఈ చిత్రం భారీ రెజ్లింగ్ యాక్షన్ ఎంటర్టైనర్. ఇంతకుముందు సోషల్ మీడియాలో తుఫాను సృష్టించిన ఈ టీజర్ ప్రత్యేకమైన పాత్ర గెటప్‌లు, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలను చూపించింది. ఫోర్ట్ కొచ్చిలోని WWEజానర్ రెజ్లింగ్ క్లబ్ నేపథ్యంలో సెట్ చేయబడిన ఈ చిత్రం ప్రేక్షకులకు గొప్ప యాక్షన్‌కామెడీ ఎక్స్ పీరియన్స్ అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది.ఇప్పటికే భారీ ఉత్సాహంతో ఎదురుచూస్తున్న ఈ చిత్రం టీజర్, పోస్టర్లు, రెగ్యులర్ అప్‌డేట్‌లతో అంచనాలను పెంచుతూనే ఉంది. సహాయక తారాగణంలో సిద్ధిక్, లక్ష్మీ మీనన్, మనోజ్ కె జయన్, ఖలీద్ అల్ అమెరి, రఫీ, టెస్ని ఖాన్, ముత్తుమణి, కార్మెన్ ఎస్ మాథ్యూ, డి'ఆర్టగ్నన్ సాబు, వైష్ణవే బిజు, శ్యామ్ ప్రకాష్, కృష్ణన్ నంబియార్, మినాన్, సరీన్ షిహాబ్, వేదిక శ్రీకుమార్, ఓర్హాన్, ఆల్విన్ ముకుంద్, అర్చిత్ అభిలాష్, తోష్ & తోజ్ క్రిస్టీ, ఆష్లే ఐజాక్ అబ్రహం ఉన్నారు. పాన్‌ఇండియా విడుదలగా, ఈ చిత్రం ఉత్తర భారత థియేట్రికల్ హక్కులను ప్రముఖ బాలీవుడ్ బ్యానర్ ధర్మ ప్రొడక్షన్స్ సొంతం చేసుకుంది. PVR ఐనాక్స్ పిక్చర్స్ తమిళనాడు, కర్నాటకలో రిలీజ్ చేస్తుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ మరియు హిందీ భాషలలో 115 కంటే ఎక్కువ దేశాలలో విడుదల అవుతుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200